



నరసరావుపేట ప్రాంతంలో శనగ

● బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు లేనట్లే..


అంచనాలకే.. ఆపసోపాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తాగు, సాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు దశాబ్దాల కల. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప ఈ కలకు సాకారం కావడంలేదు. తెలుగుదేశం ప్రభుత్వం బుగ్గవాగు అభివృద్ధికి రూ.202 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం బుగ్గవాగు సామర్థ్యాన్ని 3.5 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు పెంచుతామని ఆర్భాటంగా ప్రకటించింది. నేటికి కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు వ్యయం అంచనాలు దగ్గరే నిలిచిపోయాయి. బుగ్గవాగు అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడింది.

● వ్యయం అంచనాల దశ దాటని పనులు

● బుగ్గవాగు పైనే జల జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు ఆధారం



బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా

నిలిచిన పనుల వ్యయం అంచనాలు

బుగ్గవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ దుర్గి ప్రాంతంలో కుడికాలువ 27 నుంచి 33వ కిలోమీటర్ మధ్యలో ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 3.46 టీఎంసీలు. డెడ్ స్టోరేజి 1.69 టీఎంసీలు కాగా 1.77 టీఎంసీల నీటిని వినియోగించుకోచ్చు. సామర్థ్యాన్ని పెంచడం ద్వారా తాగు, సాగునీటి అవసరాలు తీర్చవచ్చన్న ప్రతిపాదనలు దశాబ్దాలుగా ఉన్నాయి. రిజర్వాయర్‌ను 3.46 టీఎంసీల నుంచి 4.77 టీఎంసీలకు పెంచాలని తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు నిపుణుల కమిటీ కూడా నాడు ఆమోదం తెలిపింది. రూ.424 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. రూ.202 కోట్లు నిధులు కూడా మంజూరు చేశారు. ఐతే 3.46 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు సామర్థ్యాన్ని పెంచుతామని ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించి ఇందుకు సంబంధించిన డీపీఆర్ రూపొందించాలని జలవనరుల శాఖను ఆదేశించింది. ఇందుకోసం నిధులు కూడా విడుదలయ్యాయి. 2020 అక్టోబరులో డీపీఆర్ కోసం కాంట్రాక్టర్ ను నియమించాలని ఇందుకు సంబంధించిన టెండర్‌ను కూడా జలవనరుల శాఖ పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. కాంట్రాక్టర్ తప్పుకోవడంతో పనులు వ్యయం అంచనాలు రూపొందించడం నిలిచిపోయింది.

ఏడాదంతా నీరందించే అవకాశం..

బుగ్గవాగు సామర్థ్యం పెంపుపైనే తాగునీటి పథకాల అభివృద్ధి ఆధారపడి ఉంది. పల్నాడు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల ప్రజలు వేసవిలో తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే ఏడాది పొడవునా తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారం, ప్రతి వ్యక్తికి 55 లీటర్ల తాగునీరు అందించాలన్నది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పథకం లక్ష్యం. బోర్ల నీటి సరఫరాను నిలిపి వేసి సాగర్ నీటిని అందించాలన్న దిశగా ఈ మిషన్ పనులు సాగుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జల జీవన్ మిషన్ పనులు చేపట్టాయి. కాగా పల్నాడు వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.1,500 కోట్ల వ్యయంతో తాగునీటి పథకాలను అభివృద్ధి చేసి బుగ్గవాగు నుంచి పైపులైన్ ద్వారా నీటిని గ్రామాలకు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇలా జల్‌జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు బుగ్గవాగు సామర్థ్యం పెంపుపై ఆధారపడి ఉన్నాయి. తాగు, సాగు నీటి అవసరాలను తీర్చే బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు పనులు కాగితాలకే పరిమితం కావడం గమనార్హం. పనులు చేపట్టకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వ్యయం అంచనాలు ఎప్పటికి రూపొందిస్తారో వేచి చూడాలి.

ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు కలిసిరాలేదు. రబీలోనూ అదే పరిస్థితి నెలకొంది. రబీ అయినా సాగుకు కలసి వస్తుందని ఆశపడ్డ అన్నదాలకు అడియాశే మిగిలింది. జలాశయాల్లో నీటి నిల్వలు నిండుకోవడంతో సాగుకు నీరులేదు. కేవలం వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేశారు. సాధారణం కంటే పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 1.75 లక్షల ఎకరాల్లో పంటలు సాగు తగ్గింది. వరి సాగును రైతులు పూర్తిగా కోల్పోయారు. అటు ఖరీఫ్, ఇటు రబీలో తీవ్ర వర్షాభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

రబీలోనూ.. కరువే

● ఖరీఫ్ మాదిరిగానే తగ్గిన సాగు

● బీళ్లుగా 1.75 లక్షల ఎకరాలు

● గణనీయంగా తగ్గిన వరి, మొక్కజొన్న

● శనగ, పొగాకు సాగు పెరుగుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ నాటితో పోలిస్తే రబీలో కరువు పరిస్థితులు మరింత తీవ్రమయ్యాయి. సాధారణం కంటే అక్టోబరు, నవంబరులో పల్నాడు జిల్లాలో 52.47 శాతం తక్కువ వానలు కురిశాయి. గుంటూరు జిల్లాలో 62.06శాతం, బాపట్ల జిల్లాలో 56.67శాతం తక్కువ వానలు కురిశాయి. రబీకి కీలకమైన ఈ నెలల్లోనే వానలు లేకపోవడంతో సాగు తగ్గిపోయింది. డిసెంబరు మొదటివారంలో మిచౌంగ్ తుపాను ముంచేసింది. ఈ తర్వాత కూడా సరైన వానల్లేవు. మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన అతి భారీ వర్షాలు వేసిన శనగ పంటను తుడిచి పెట్టుకుపోయింది. మళ్లీ అదే పొలాల్లో తిరిగి శనగ సాగు చేయాల్సి వచ్చింది. దీంతో శనగ సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. రబీలో వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్న ఈ పంట సాగు గణనీయంగా తగ్గింది. వరి సాధారణ విస్తీర్ణం 1,48,239 ఎకరాలు ఉంటే 25,790 ఎకరాల్లోనే సాగైంది. సాధారణంలో 17.39 శాతమే వరి సాగు చేశారు. సాగు నీరు సరఫరా లేకపోవడంతో కేవలం బావులు, బోర్లు, వాగుల కింద మాత్రమే వరి సాగు చేశారు. గత ఐదేళ్లలో పరిశీలించినా ఇంత తక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేసిన దాఖలాలు లేవు.

పెరిగిన శనగ, పొగాకు సాగు...

రబీలో వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్న మూడు జిల్లాల్లో సాధారణ విస్తీర్ణం 1,47,457 ఎకరాలు ఉంటే కేవలం 70,015 ఎకరాల్లోనే సాగు చేశారు. మొక్కజొన్న సాగు దారుణంగా పడిపో యింది. మిచౌంగ్ తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాల అనంతరం నీరు అవసరం లేని శనగ పంటను రైతులు విస్తృతంగా సాగు చేశారు. శనగ సాగు గణనీయంగా పెరిగింది. శనగ సాధారణ విస్తీర్ణం 1,27,555 ఎకరాలు కాగా 1,37,648 ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంట సాగు బాపట్ల జిల్లాలో భారీగా తగ్గగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గణనీయంగా పెరిగింది. పొగాకు సాగు కూడా పెరిగింది. పొగాకు 21,515 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా 42,718 ఎకరాల్లో సాగు చేశారు. దాదాపు 21,203 ఎకరాల్లో పొగాకు సాగు పెరిగింది. బాపట్ల జిల్లాలో అత్యధికంగా పొగాకు సాగు పెరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వరి, మొక్కజొన్న పంటల సాగు భారీగా తగ్గగా శనగ, పొగాకు పంటలసాగు గణనీయంగా పెరిగింది.

పంటల సాగు వివరాలు ఎకరాల్లో..

జిల్లా	సాగు లక్ష్యం	విస్తీర్ణం	విస్తీర్ణం	శాతం
పల్నాడు	1,42087	1,35,340	80,792	60
గుంటూరు	1,82,082	1,70,590	1,31,395	67
బాపట్ల	3,89,112	3,68,047	2,76,540	66



నరసరావుపేట ప్రాంతంలో మొక్కజొన్న



ప్రయోగాలకు ఏర్పాట్లు

5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ● పర్యవేక్షణ కేంద్రాలను తనిఖీ చేసిన డీవీఈవో పి.ఎరయ్య

బాపట్లటౌన్, ఫిబ్రవరి 2:ఇంటర్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేశారు. ఈ నెల 5 నుంచి 20వ వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి(డీవీఈవో) శుక్రవారం పి.ఎరయ్య ప్రయోగ పరీక్షా కేంద్రాలలో పరికరాలు, రసాయనాలను తనిఖీ చేశారు. బోర్డు నిర్వహించే నైతికత, మానవ విలువలు పరీక్షా కేంద్రాలను కూడా ఆయన పరిశీలించారు. జిల్లాలో ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 5 నుంచి, ఒకేషనల్ విద్యార్థులకు 11వ తేది నుంచి జరుగుతాయి. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు జిల్లాలో 447 మంది, జనరల్ విద్యార్థులు 7262 మంది ఉండగా వారి కోసం జిల్లావ్యాప్తంగా 62 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 వరకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ప్రయోగ పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులతోపాటు గాలి, వెలుతురు, పరికరాలు, రసాయనాలు, సీసీ కెమెరాలను డీవీఈవో పరిశీలించారు. పరీక్షలు పూర్తి కాగానే ఆయా కేంద్రాలకు కేటాయించిన ఇన్విజిలేటర్ అదే రోజు స్వయంగా మూల్యాంకనం చేసి ఇంటర్మీడియట్ వెబ్‌సైట్‌లో విద్యార్థుల మార్కులను బోర్డుకు పంపుతారు. ప్రతి పరీక్షా కేంద్రం సీసీ కెమేరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో పుటేజిని పర్యవేక్షించడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన ఈ ఏడాది ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీవీఈవో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆ కళాశాల ప్రిన్సిపాల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తారని, ప్రైవేటు కళాశాలలకు మాత్రం ప్రత్యేకంగా చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బైపీసీ విద్యార్థులకు బయాలజీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబుల్లో ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా ల్యాబుల్లో పూర్తిస్థాయి పరికరాలు, రసాయనాలు పక్కాగా ఉన్నాయని, పరిశీలించిన తర్వాతే ఆయా కేంద్రాలకు అనుమతి ఇచ్చామని తెలిపారు. తాగునీరు, ఇతర మౌలిక వసతులు పక్కాగా ఉండాలని ఆదేశించామన్నారు.

పర్యావరణ విద్య పరీక్ష 23కు వాయిదా

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా అర్హత పరీక్షగా నిర్వహించే పర్యావరణ విద్య పరీక్షను వాయిదా వేసింది. 3వ తేది శనివారం జరగాల్సిన పరీక్షను ఈ నెల 23 శుక్రవారా నికి వాయిదా వేశారు. జూనియర్ కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు ఈ మార్పు ను గమనించాలని డీవీఈవో తెలిపారు.

నిధుల కూత

● కేంద్ర బడ్జెట్‌లో గుంటూరుకు కేటాయింపు ● గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్‌కు రూ.200 కోట్లు

● నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్లు మార్గాలకూ నిధులు ● మల్టీ ట్రాకింగ్ కనెక్టివిటీ నిమిత్తం

గుంటూరు జంక్షన్‌కు రూ.50 కోట్లు

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గుంటూరు రైల్వే డివిజన్‌కి పెద్ద మొత్తంలోనే కేటాయింపులు జరిగాయి. దశాబ్దాల కల అయిన గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుని గత ఏడాది గతి శక్తి స్కీమ్ కింద ప్రకటించిన కేంద్రం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించి నిర్మాణం ప్రారంభించేందుకు మార్గం సుగమం చేసింది. అలానే నిర్మాణ దశలో కొనసాగుతున్న నడికుడి - శ్రీకాళహస్తి సింగిల్ లేన్, గుంటూరు - గుంతకల్లు రెండో రైలు మార్గం ప్రాజెక్టులకు ఆశాజనకంగా నిధులు కేటాయించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఎన్నికలకు ముందు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ని గురువారం పార్ల మెంట్‌లో ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. ఈ బడ్జెట్‌లో గుంటూరు రైల్వే డివిజన్‌కి జరిగిన కేటాయిం పులు ఆశాజనకంగానే ఉన్నాయి. రైళ్ల పునరుద్ధరణ, పెరిగిన సరుకు రవాణాతో నడికుడి రైలుమార్గం రద్దీగా మారిపోయింది. ఈ నేపథ్యంలో రైళ్ల క్రాసింగ్ సమస్యలు ఎదుర్కొంటున్నాయి. దీని వల్ల గమ్యస్థానాలకు కొంత ఆలస్యంగా చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది కేంద్ర ప్రభుత్వం గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుని మంజూరు చేసింది. 248 కిలోమీటర్ల పొడవునా నిర్మించాల్సి ఉన్నా ఈ రెండో రైలుమార్గం కోసం రూ.2,853.23 కోట్ల నిధులు అవసరం అవుతాయని అంచనా వేసింది. కాగా ఈ బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించడం ద్వారా నిర్మాణ పనులకు అడుగులు పడే వాతావరణాన్ని ఆర్థిక మంత్రి కల్పించారు.



నల్లపాడు- బీబీనగర్ లైన్

ఇక పనులు వేగవంతం..

గుంటూరు - గుంతకల్లు రెండో రైలు మార్గం, నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం పనులు కొన్నేళ్లుగా నిర్మాణం జరుగుతోన్నాయి. నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గానికి ఈ బడ్జెట్ లో మూలధనం కింద రూ.150 కోట్లు, సేఫ్టీ ఫండ్ కింద మరో రూ.300 కోట్లు కేటాయింపులు జరిపింది. గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్‌కు పెండిం గ్ పనులు ఉండగా వాటిని పూర్తి చేసేందుకు రూ.283.50 కోట్లు ఈ బడ్జెట్‌లో పొందుపరిచిం ది. తద్వారా ఈ రెండు రైలు మార్గాల పనులను మరింత ముందుకు తీసుకెళ్లబోతోన్నామన్న సంకే తాలను కేంద్ర ప్రభుత్వం పంపింది. విష్ణుపురం వద్ద బైపాసు లైను 4.90 కిలోమీటర్ల పొడవునా నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించింది. గుంటూరు రైల్వే జంక్షన్‌లో మల్టీ ట్రాకింగ్ కనెక్టివిటీ కోసం రూ.50 కోట్లు మంజూరు చేసింది. తద్వారా భవిష్యత్‌లో గుం టూరు - గుంతకల్లు, గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజె క్టులు పూర్తి అయితే ఇక్కడ రైళ్ల రాకపోకలకు ఆటంకాలు లేకుండా ఉంటుందని రైల్వేవర్గాలు చెబుతున్నాయి.

అమరావతిపై మారని తీరు

అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని అని కుండబద్దలు కొట్టి చెబుతున్న బీజేపీ మరోవైపు నిధుల కేటాయింపు వచ్చేసరికి సవతితల్లి ప్రేమను చూపుతోంది. రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన అమరావతి రాజధానికి రైలుమార్గం ప్రాజెక్టుకి ఈ బడ్జె ట్‌లో కూడా మొండిచెయ్యే చూపిం చింది. విజయవాడ - గుంటూరు వయా అమరావతి 106 కిలోమీటర్ల రైలు మార్గానికి రూ.2,679.59 కోట్ల నిధులు అవసరమౌతాయని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించి సర్వే, డీపీఆర్ కూడా ఎప్పుడో సిద్ధమైంది. అయితే నిధులు, భూమిని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కేంద్రం షరతు పెట్టడంతో ఈ ప్రాజెక్టు పెండింగ్‌లో పడింది. కనీసం ఎన్నికల సంవత్సరంలోనైనా కొంత నిధులు కేటాయించి రైలుమార్గం నిర్మాణానికి అడుగులు పడేలా చేస్తుందని అంతా ఆశలు పెట్టుకున్నారు. అయితే ఎప్పటి లానే ఈ ఏడాది కూడా బీజేపీ పాలిత ఎన్‌డీఏ ప్రభుత్వం మొండి చెయ్యే చూపించింది.

పోలీసులతో మాట్లాడుతున్న అద్దంకి నియోజకవర్గ క్రీడాకారులు



ఆడుదాం ఆంధ్రా.. అస్తవ్యస్తం

● క్రీడాకారుల మధ్య తలెత్తిన సమస్య ● జేసీకి ఫిర్యాదు

బాపట్ల, ఫిబ్రవరి2: జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడాప్రాంగణంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు జనవరి 31వ తేదీతో ముగియాల్సి ఉంది. అయితే పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల జట్ల మధ్య ఓ సమస్య తలెత్తింది. పర్చూరు క్రీడాకారులు ఇతర జిల్లాకు చెందిన ఐదుగురిని తీసుకొచ్చి పోటీలో పాల్గొంటున్నారని అద్దంకి క్రీడాకారులు ఆరోపించారు. సదరు క్రీడాకారులు తమ ఆధార్ కార్డులు చూపించినప్పటికీ వేలిముద్ర ద్వారా వెరిఫికేషన్ చేయించాలని పట్టుబట్టారు. రెండురోజులు నుంచి సమస్య తీవ్ర రూపం దాల్చింది. శుక్రవారం ఉదయం మరలా మ్యాచ్ ప్రారంభం సమయానికి అద్దంకి క్రీడాకారులకు సీపీఐ నాయకులు జేబీ శ్రీధర్, కనకారెడ్డిలు మద్దతుగా వచ్చి అధికారుల తీరును తప్పుపట్టారు. రూరల్ సీఐ జి.హజరత్‌బాబు, ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్, సిబ్బంది క్రీడా మైదానానికి వచ్చి క్రీడాకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అధికారులు నుంచి రాకపోవటం టీమ్‌కోచ్ బి.నరేష్, కెప్టెన్ ఎస్‌కె.రఫీలు క్రీడాకారులతో కలిసి జాయింట్ కలెక్టర్‌కు తమ సమస్యను వివరించారు. దీనిపై విచారణ జరిపి పోటీలు జరిపిస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. అధికారుల ఆదేశాల మేరకు పోటీ జరుపుతామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె.పాల్‌కుమార్ తెలిపారు.



సమస్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న రూరల్ సీఐ హాజరత్‌బాబు

ఒత్తిళ్లు.. ఆత్మహత్యలు

● ఆర్బీకే నిర్వహణలో వీఏఏల మనస్తాపం

● నేతలు, అధికారుల వేధింపులతో బలవన్మరణాలు

● మంత్రి మేరుగ ఇలాకాలో వెలుగు చూసిన ఘటనలు





పూజిత భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌బీకే సంఘ నాయకులు

వేమూరు, ఫిబ్రవరి 2: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్బీకేలకు అనుబంధంగా పనిచేస్తున్న వీఏఏలకు తలకు మించిన భారం మీదపడడంతో ఆత్మహత్యలే మార్గంగా ఎంచుకుంటున్నారు. ఒకవైపు అధికారులు ఒత్తిళ్లు.. మరోవైపు అధికార పార్టీ నాయకుల బెదిరింపులతో వారు తల్లడిల్లిపోతున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వేమూరు మండలం చావలి గ్రామం ఆర్బీకేలో పని చేస్తున్న వీఏఏ, ఆర్‌బీకే ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి బెల్లంకొండ పూజిత(23) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. గతంలో ఇదే మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన వీఏఏ గతంలో ఆత్మహత్యకు యత్నించి చికిత్స ద్వారా ప్రాణాలు నిలుపుకుంది. ఈ ఘటన మరువకముందే పూజిత ఆత్మహత్య సంచలనం సృష్టిస్తోంది. ఈ రెండు ఘటనలు కూడా రాష్ట్ర మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున నియోజకవర్గ పరిధిలో చోటుచేసుకోవడం విశేషం. ఇలాగే అధికారుల ఒత్తిళ్ళు అధికార పార్టీ నాయకుల బెదిరింపులు తాళలేక తూర్పు గోదావరి, నెల్లూరు, కడప జిల్లాలో కూడా ముగ్గురు వీఏఏలు ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. వరుస ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం తీరు మార్చుకోకపోవడంపై సంఘాల నాయకులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని సంతోషపడుతున్న వారి కుటుంబాల్లో ఈ ఘటనలు విషాదం నింపుతున్నాయి.

తడిచిన ఎరువులు అమ్మలేక ఆత్మహత్య

చావలి ఆర్బీకే ద్వారా అమ్మకానికి సిద్ధం చేసిన ఎరువులు వర్షాలకు తడిచాయి. తడిసిన ఎరువులను అమ్మాలని అధికారులు పూజితపై ఒత్తిడి తెచ్చారు. భవన యజమానికి అద్దె చెల్లించకపోవడంతో ఎరువులను స్వాధీనం చేసుకుని డబ్బు చెల్లించలేదు. దీంతో పై అధికారులు ఒత్తిడి మరింతగా పెరిగింది. డబ్బు చెల్లించలేని పరిస్థితిలో పూజిత గురువారం కన్నీటితో ఇంటికి చేరుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

చావమని ఉద్యోగాలు ఇచ్చారా?: విజయ్‌మోహన్

ప్రభుత్వం తమకు ఉద్యోగాలు ఇచ్చింది బతకమనా.. లేక చావమనా.. అని రాష్ట్ర రైతు భరోసా కేంద్రాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.విజయ్‌మోహన్ ప్రశ్నించారు. పూజిత మృతదేహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతీ విషయాన్ని అధికారులు, పార్టీ నేతలు తమని బలి పశువులను చేస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖ తీరు చాలా దారుణంగా ఉందని మరి ముఖ్యంగా ఉన్నతాధికారులు ఇష్టారాజ్యాంగా కింది స్థాయి ఉద్యోగులను అనేక రకాలుగా ఒత్తిళ్ళకు గురి చేస్తున్నారన్నారు. ఎరువులను నేతలు స్వాధీనం చేసుకుని డబ్బు చెల్లించడంలేదని ఆ విషయం తెలిసి కూడా అధికారులు ఉద్యోగులను వేధిస్తున్నారన్నారు. అనంతరం పూజిత మృతదేహాన్ని సందర్శించడానికి వచ్చిన పలు ప్రాంతాలకు చెందిన వీఏఏలు అక్కడే కొద్దిసేపు నిరసన తెలిపారు.

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ/డీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

సాంప్రదాయేతర శక్తి వనరులు

సాంప్రదాయేతర శక్తి వనరులు ఎల్లప్పుడూ లభ్యమవుతాయి. అందువల్ల వీటిని పునరుద్ధరణ(Renewable) శక్తి వనరులు అంటారు. వీటిని ప్రత్యామ్నాయ శక్తి వనరులు అని కూడా అంటారు. ప్రత్యామ్నాయ శక్తి వనరులకు ఉదాహరణలు..

- జల విద్యుత్ శక్తి(Hydro Electricity)
- సౌర శక్తి(Solar Energy)
- పవన శక్తి(Wind Energy)
- అలల శక్తి(Wave Energy)
- వేలాతరంగా శక్తి(Tidal Energy)
- భూతాప శక్తి(Geothermal Energy)



- బయోమాస్(Biomas)
- OTEC(Ocean Thermal Energy Convertion)

1981లో ప్రత్యామ్నాయ శక్తి వనరులను అభివృద్ధి చేసేందుకు భారత ప్రభుత్వం DNES (Departmen of Conventional Energy Sources) అనే సంస్థను ఏర్పాటు చేసింది.

జల విద్యుత్: 2019 నాటికి మన దేశంలో మొత్తం జల విద్యుత్ ఉత్పత్తి- 45,293 మెగా వాట్లు. జలవిద్యుత్ ఉత్పత్తిలో పంజాబ్, కర్ణాటక అగ్ర స్థానాల్లో ఉన్నాయి. జల విద్యుత్ ఉత్పత్తికి 1975లో నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇందిరాసాగర్ దేశంలో అత్యధిక జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టు. దేశంలో మొదటిసారిగా జల విద్యుత్‌ను జనరేటర్ల సహాయంతో 1889లో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతంలో గల 'లోనాపల' వద్ద ఉత్పత్తి చేశారు. మొట్టమొదట జల విద్యుత్ కేంద్రాన్ని 1902లో కర్ణాటకలోని మైసూర్ వద్ద ఉన్న శివన్నసముద్రం వద్ద కావేరీ నదిపై నిర్మించారు. ఈ జల విద్యుత్ కేంద్రం కర్ణాటకలోని కోలార్ బంగారు గనికి విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. దేశంలో అత్యంత ఎత్తుగల జలవిద్యుత్ కేంద్రం - నాత్పా జాక్రీ(హిమాచల్ ప్రదేశ్). కేరళ 100 శాతం జల విద్యుత్ పైనే ఆధారపడ్డది. జల విద్యుత్‌ను తెల్ల బొగ్గు అని కూడా అంటారు. ప్రపంచ జల విద్యుత్ ఉత్పత్తిలో మనదేశం ఆరో స్థానంలో, చైనా మొదటి స్థానంలో ఉన్నాయి. ప్రపంచంలో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రం త్రీ గార్జెస్. దీని ఉత్పత్తి సామర్థ్యం 22,500 మెగావాట్లు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రాన్ని బ్రెజిల్‌లోని ఇటైపు వద్ద నిర్మించారు. దీని సామర్థ్యం 14,000 మెగా వాట్లు.

సౌర శక్తి: 2019 నాటికి మొత్తం సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం 28,180.71 మెగా వాట్లు. సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం అధికంగా గల రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ. కొచ్చి(కేరళ) విమానాశ్రయం సౌర విద్యుత్‌తో నడుస్తోంది. 2020 జూన్‌లో ఆసియాలోనే అతిపెద్ద సోలార్ ప్లాంట్‌ను మధ్యప్రదేశ్‌లోని 'రివా'లో ప్రారంభించారు. దీనిని 500 హెక్టార్ల విస్తీర్ణంలో 700 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించారు. ప్రపంచంలో అతిపెద్ద సోలార్ బాయిలర్‌ను 2009లో షిరిడీలో ఏర్పాటు చేశారు. దీనిని ఉపయోగించి ప్రతి రోజూ 50,000 మందికి ఆహారపదార్థాలు వండవచ్చు. తిరుమలలో 15000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. దిల్‌షుక్‌నగర్(హైదరాబాద్)లోని సాయిబాబా గుడిలో 3000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. సౌర శక్తి ఉత్పత్తిలో అమెరికా, జర్మనీ, చైనా, జపాన్ వరుస స్థానాల్లో ఉన్నాయి. భారత్ ఎనిమిదో స్థానం లో ఉంది. మొట్టమొదట సౌరశక్తి కేంద్రం జమ్మూ కశ్మీర్‌లోని చొగ్లాంసర్ వద్ద నిర్మించారు. ఆసియాలో నే అతిపెద్ద సౌర తటాకం(Solar Pond) గుజరాత్‌లోని భుజ్ వద్ద ఉంది.

పవన శక్తి: దేశ పవన శక్తి ఉత్పత్తి సామర్థ్యం 35,625 మెగావాట్లు. ప్రపంచంలో పవన శక్తి ఉత్పత్తిలో చైనా మొదటి, భారత్ నాలుగో స్థానాల్లో ఉన్నాయి. దేశంలో పవన శక్తి ఉత్పత్తిలో తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర వరుస స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో పవన విద్యుత్‌ను ఎక్కువగా ఉపయోగించుకుంటున్న ప్రాంతం జోగిమట్టి(కర్ణాటక). దేశంలో మొట్టమొదటి పవన శక్తి కేంద్రాన్ని గుజరాత్‌లోని మాండవి వద్ద 1986లో నిర్మించారు. దేశంలో అతిపెద్ద శక్తి కేంద్రం తమిళనాడులోని ముప్పాండల్ వద్ద ఉంది.

అలల శక్తి: మొట్ట మొదటి అలల శక్తి కేంద్రాన్ని కేరళలోని తిరువనంతపురం వద్ద గల విజింజీం వద్ద నిర్మించారు.

వేలాతరంగ శక్తి: ఆసియాలోనే మొట్టమొదటి వేలాతరంగ విద్యుత్ కేంద్రం గుజరాత్‌లోని కాండ్లా వద్ద నిర్మించారు. వేలాతరంగ విద్యుత్ ఉత్పత్తికి అనుకూలమైన ప్రాంతాలు- గల్ఫ్ ఆఫ్ కచ్(1200 మెగావాట్లు), గల్ఫ్ ఆఫ్ కంభట్(7000 మెగావాట్లు), సుందర్ బన్స్.

భూతాప శక్తి: భారతదేశంలో ఏకైక భూతాప శక్తి కేంద్రం హిమాచల్ ప్రదేశ్‌లోని 'మణికరణ్' వద్ద ఉంది. జమ్మూ కశ్మీర్‌లోని లడఖ్‌లో గల పూగా లోయ కూడా భూతాపశక్తి ఉత్పత్తికి అనుకూలమైంది. భారత్‌లో 45,000 మెగా వాట్ల జియో థర్మల్ ఉత్పత్తికి అవకాశం ఉంది.

బయోమాస్: దీనిని వ్యర్థ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. మొట్ట మొదటి బయోమాస్ విద్యుత్ కేంద్రం పంజాబ్‌లోని జలంధర్ వద్ద నిర్మించారు. బయోమాస్‌లో 60 శాతం మీథేన్, 40 శాతం కార్బన్ డై ఆక్సైడ్ ఉంటాయి.

OTEC(Ocean Thermal Energy Convertion): దీనిని సముద్రపు నీటి ఉష్ణోగ్రతల వ్యత్యాసం ఆధారంగా ఉత్పత్తి చేస్తారు. ప్రపంచంలోనే మొట్టమొదటి OTEC కేంద్రం తమిళనాడులోని ట్యూటికోరిన్ వద్ద అమెరికా సహాయంతో నిర్మించారు. ప్రస్తుతం భారతదేశంలో ఐదు ప్రాంతీయ గ్రిడ్స్ ఉన్నాయి.



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ.

నిట్ వరంగల్‌లో ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ



వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ వరంగల్)- ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ)లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌లను కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేస్తోంది.

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి 12 రోజులు. ప్రతి ప్రోగ్రామ్‌లో 100 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. ఐఐటీలు, ఐఐఐటీలు, నిట్ సంస్థల్లో పనిచేస్తున్న ఫ్యాకల్టీ మెంబర్లు సెషన్స్ నిర్వహిస్తారు. ఇంజనీరింగ్/ఎంసీఏ కాలేజీల ఫ్యాకల్టీలు, ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్, పీజీ చదువుతున్నవారు, పీహెచ్‌డీ అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

స్మార్ట్ కాంట్రాక్ట్ మాస్టరీ:పయనీరింగ్ ద ఫ్యూచర్ ఆఫ్ బ్లాక్ చెయిన్ అప్లికేషన్స్

సంస్థ ఆధ్వర్యంలోని సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్, ఈ&ఐసీటీ అకాడమీలు ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్నాయి. ఇందులో బ్లాక్ చెయిన్-కరెంట్ అండ్ ఫ్యూచర్ అప్లికేషన్స్, ఇన్ఫర్మేషన్ అటెస్టేషన్ అండ్ మల్టీ ప్రొటోకాల్ స్టోరేజ్ ఫర్ వెబ్, బ్లాక్ చెయిన్-క్వెరీ లాంగ్వేజ్, బిజినెస్ నెట్‌వర్క్స్ అండ్ ప్రాసెస్ బేస్డ్ ఆన్ మోడలింగ్ అండ్ బ్లాక్ చెయిన్ తదితర అంశాలు వివరిస్తారు. టెస్టింగ్ టూల్స్‌కు సంబంధించి ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మార్చి 25 నుంచి ఏప్రిల్ 5 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20

ఆప్టిమైజేషన్ టెక్నిక్ ఫర్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్

ఈ ప్రోగ్రామ్‌ని సంస్థ ఆధ్వర్యంలోని ఈ&ఐసీటీ అకాడమీ నిర్వహిస్తోంది. ఇందులో డైరెక్ట్ సెర్చ్ మెథడ్స్, గ్రేడియంట్ బేస్డ్ మెథడ్స్, సింపుల్ మెథడ్ అండ్ లీనియర్ ప్రోగ్రామింగ్, జెనెటిక్ అల్గారిథమ్, పార్టికల్ ఆప్టిమైజేషన్, డిఫరెన్షియల్ ఎవల్యూషన్, కాలనీ ఆప్టిమైజేషన్ అల్గారిథమ్, సిమ్యులేటెడ్ ఎనీలింగ్ అల్గారిథమ్ తదితర అంశాలు వివరిస్తారు. సాఫ్ట్ కంప్యూటింగ్, మెటా ఆప్టిమైజేషన్ అల్గారిథమ్‌లకు సంబంధించిన కేస్ స్టడీస్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మార్చి 11 నుంచి 22 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 5
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **వెబ్‌సైట్:** nitw.ac.in

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ఐకార్ - నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆరు నుంచి ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్, 12 వారాల బిజినెస్ బూట్ క్యాంప్, 13 వారాల ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. ఇందులో మొత్తం 66 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

నార్మ్‌లో పీజీడీఎం అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్

అర్హత: యూజీసీ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, కమర్షియల్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ, డెయిరీ సైన్స్/టెక్నాలజీ, ఫిషరీస్, ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, సెరికల్చర్, వెటర్నరీ సైన్స్, హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాలకు సంబంధించి ఒకదానిలో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు వర్తిస్తుంది. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ తప్పనిసరి. సంబంధిత రంగంలో కనీసం ఆర్నెల్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** naarm.org.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/K1ylmt7లో చదవండి.

ఐఐఎం రోహ్‌తక్‌లో ఐపీఎం

రోహ్‌తక్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది అయిదేళ్ల వ్యవధిగల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో రాణించాలనుకొనే వారికి ఈ ప్రోగ్రామ్ అనువుగా ఉంటుంది. ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐపీఎం ఏటీ) 2024, పర్సనల్ ఇంటర్వ్యూ, అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 165 సీట్లు ఉన్నాయి. మొదటి మూడేళ్ల తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి బీబీఏ(బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) డిగ్రీని ప్రదానం చేస్తారు. ప్రోగ్రామ్ మొత్తం పూర్తిచేసిన వారికి ఎంబీఏ డిగ్రీ ఇస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డ్ నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి, ఇంటర్ స్థాయుల్లో జనరల్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 జూన్ 30 నాటికి 20 ఏళ్లు మించకూడదు.


ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఐపీఎం ఏటీ) 2024 వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్‌లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌లో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. సెక్షన్‌కు 40 నిమిషాలు చొప్పున మొత్తం పరీక్ష సమయం రెండు గంటలు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 6 నుంచి
- **దరఖాస్తు ఫీజు:** రూ.4,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 10
- **ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024:** మే 18 నుంచి
- **వెబ్‌సైట్:** iimrohtak.ac.in

నవ్య | చిత్రజ్యోతి

2025

జనవరి 10న విశ్వంభర



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా టైటిల్ టీజర్‌తోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తన అభిమానుల్ని, ప్రేక్షకుల్ని అలరించారు చిరంజీవి. 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్ కోసం 13 భారీ సెట్స్‌తో కొత్త ప్రపంచం సృష్టించారు. ఈ సినిమా షూటింగ్‌లో మెగాస్టార్ శుక్రవారం అడుగుపెట్టారు. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ అత్యంత భారీ బడ్జెట్‌తో 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి ఇప్పటివరకూ నటించిన చిత్రాల్లో ఇదే కాస్ట్లీయస్ట్ ఫిల్మ్. వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 10న 'విశ్వంభర'ను విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. ఈ చిత్రానికి సాహిత్యం: శివశక్తి దత్తా, చంద్రబోస్, సంగీతం: కీరవాణి, ఛాయాగ్రహణం: చోటా కె నాయుడు, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరావు, సంతోష్ కామిరెడ్డి.

అర్థం చేసుకొనే లైఫ్ పార్టనర్ ఉన్నాడు



లావణ్య

'వరుణ్‌తేజ్‌తో పెళ్లయిన తర్వాత కెరీర్ పరంగా ఏమీ మార్పు లేదు.. మెగా కుటుంబంలోకి వచ్చాక 'నువ్వు ఇలా చేయాలి.. అలా చేయాలి' అని ఎవరూ నాకు చెప్ప లేదు. కెరీర్ పరంగా నాకు కావాల్సినంత స్వేచ్ఛ ఉంది. వరుణ్ లాంటి అర్థం చేసుకొనే లైఫ్ పార్టనర్ ఉన్నాడు. మా వరకూ గతంలో లాగానే ఉన్నాం. ఒక పెద్ద ఫ్యామిలీలోకి అడుగుపెట్టడం మంచి అనుభూతినిచ్చింది. వరుణ్, నేను ఎవరి ప్రొఫెషనల్ వర్క్‌లో వాళ్లం ముందుకు వెళ్తాం. నేను చేసే ప్రాజెక్ట్‌లో వరుణ్ ఇన్‌వాల్వ్ కాడు. 'మిస్ పర్ఫెక్ట్' స్క్రిప్ట్ చదివి బాగుందన్నాడు' అని చెప్పారు లావణ్య. తను హీరోయిన్‌గా నటించిన వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్' డిస్నీ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్న సందర్భంగా ఆమె మీడియాతో ముచ్చటించారు.

- 'ఈ సిరీస్‌లో మంచి నటులు ఉన్నారు. రొమాంటిక్, కామెడీ ఎలిమెంట్స్ బ్లెండ్ చేసిన మంచి స్క్రిప్ట్ ఇది. ఇలాంటి స్క్రిప్ట్ నా దగ్గరకు రావడం హ్యాపీగా ఉంది. ఇందులో నేను 'మిస్ లావణ్య, లక్ష్మి' అనే పాత్రలు చేశాను. అన్ని రకాల ఎమోషన్స్ ఈ పాత్రల్లో ఉన్నాయి. నా పర్సనల్ లైఫ్‌కు దగ్గరగా ఉండే పాత్రలివి. సినిమాలకు, వెబ్ సిరీస్‌కు పెద్ద తేడా కనిపించలేదు. సినిమా షూటింగ్ జరిగినట్టే ఈ వెబ్ సిరీస్ వర్క్ కూడా జరిగింది' అని చెప్పారు లావణ్య
- కొత్త దర్శకులతో పని చేయడం ఎప్పుడూ రిఫ్రెషింగ్‌గా ఉంటుంది. మా దర్శకుడు విశ్వక్ ఖండేరావు రైటింగ్ యూనిక్‌గా ఉంటుంది. అతనితో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. సెట్‌లో ఎవరు సలహా చెప్పినా స్వీకరించేవారు. పర్ఫెక్షనిస్ట్‌గా ఉండడం వల్ల ఎన్ని సమస్యలు వస్తాయో ఈ సిరీస్‌లో చూస్తారు' అని ఆమె అన్నారు. నిర్మాత సుప్రియ తనకు మంచి స్నేహితురాలు కావడంతో ఈ సిరీస్ కంఫర్ట్‌గా చేశానని చెప్పారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఓ కొత్త హీరోతో నిర్మించే చిత్రంలో నటించనున్నట్లు లావణ్య చెప్పారు. ఇందులో తనది పోలీస్ ఆఫీసర్ పాత్ర అన్నారు. దీంతో పాటు ఒక తమిళ సినిమా కూడా చేస్తున్నట్లు వెల్లడించారు.

వేసవిలో వస్తున్న ఫ్యామిలీ స్టార్



విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం విడుదల తేదీని చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. ఏప్రిల్ 5న ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ ఉన్నారు. రిలీజ్ డేట్ ప్రకటించిన సందర్భంగా స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ మ్యాన్‌లా కనిపిస్తున్నారు. లుంగీ కట్టుకుని భుజాన గోనె సంచీ, ఆధార్ కార్డ్‌తో విజయ్ నడిచి వస్తున్న పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/lb27nMSలో చదవండి.

యువతను మెప్పించే రేవ్ పార్టీ

క్రిష్ సిద్దిపల్లి

'నేను లేని నా ప్రేమకథ' చిత్రంతో హీరోగా వెండితెరకు పరిచయమయ్యారు క్రిష్ సిద్దిపల్లి. ఆయన కథానాయకుడిగా రూపొందిన 'రేవ్‌పార్టీ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా క్రిష్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- హీరో అవ్వాలనేది నా కోరిక. కెరీర్ ఆరంభంలో పలు తెలుగు చిత్రాలకు సహాయ దర్శకుడిగా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశాను. ఆ తర్వాత నటుడిగా చిన్నపాత్రలు పోషించాను. ప్రస్తుతం హీరోగా మంచి అవకాశాలు వస్తున్నాయి. నేను హీరోగా నటించిన 'రేవ్‌పార్టీ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. యువతను ఆకట్టుకునే వినూత్నమైన కథతో ఈ చిత్రం తెరకెక్కింది. రాజు బొనగాని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. రితిక చక్రవర్తి, ఐశ్వర్యగౌడ హీరోయిన్లు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రీకరణ పూర్తి చేశాం. ఉడుపి, గోవా, బెంగళూరు ప్రాంతాల్లో ఎక్కువగా రేవ్ పార్టీలు జరుగుతుంటాయి. అందుకే ఆ ప్రాంతంలోని ఒరిజినల్ లోకేషన్స్‌లో చిత్రీకరణ చేశాం. రేవ్‌పార్టీలు ఎలా జరుగుతాయి?, వాటి వెనుక ఎవరు ఉంటారు, యువతకు ఎలాంటి నష్టం జరుగుతుందనేది ఆసక్తికరంగా తెరకెక్కించాం. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం.



22న గోవాలో రకుల్ పెళ్లి



హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ పెళ్లి ముహూర్తం ఖరారు అయింది. తన ప్రియుడు, నిర్మాత, నటుడు జాకీ భగ్నానితో ఆమె వివాహం ఈ నెల 22న గోవాలో జరగనుంది మిడిల్ ఈస్ట్‌లో ధూమ్ ధామ్‌గా డిస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోవాలని మొదట రకుల్, ఆమె బాయ్ ఫ్రెండ్ అనుకున్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ డిస్టినేషన్ వెడ్డింగ్స్ విదేశాల్లో కాకుండా మన దేశంలోనే నిర్వహించాలని ఇటీవల .విజ్ఞప్తి చేయడంతో రకుల్, జాకీ తమ ఆలోచన మార్చుకుని గోవాలో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పెళ్లి తర్వాత ముంబైలో రిసెప్షన్ గ్రాండ్‌గా ఏర్పాటు చేసి టాలీవుడ్, బాలీవుడ్‌లోని చిత్ర ప్రముఖులందరినీ ఆహ్వానించాలని కూడా వారు అనుకున్నారు. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ముంబైలో కానీ మరెక్కడ కానీ వీళ్ల పెళ్లి రిసెప్షన్ జరగడం లేదు.



గ్రామీణ ప్రేమకథ

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. ట్రైలర్ బాగుందనీ, సినిమా విజయం సాధించాలనీ ఆయన కోరారు. నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకొన్న ప్రేమకథ ఇది. ఈ నెలలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయనీ, తను అనుకున్న విధంగా సినిమా తీయడానికి నిర్మాత ఎంతో సహకరించారనీ దర్శకుడు తెలిపారు. దీప్తి, మేకా రామకృష్ణ, జయప్రకాశ్, ప్రియ, నవీన్, రవి శివతేజ, సుమన్, రాచర్ల లాస్య తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు: వసంత్ వెంకట్ బాలా, సంగీతం: చైతు కొల్లి, ఛాయాగ్రహణం: తాజ్ జీడీకే.



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర కార్మిక నాయకులు

వడ్డెరలను బెదిరిస్తే సహించం

● దాచేపల్లి వడ్డెర కార్మిక నాయకులు

దాచేపల్లి, ఫిబ్రవరి2: బలహీనవర్గాలకు చెందినవారని వడ్డెర సామాజికవర్గానికి చెందినవారిని బెదిరించి భయపెట్టాలని చూస్తే సహించమని దాచేపల్లి మండల వడ్డెర సంఘ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో దాచేపల్లి వడ్డెర నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వడ్డెర నాయకులు మాట్లాడుతూ గురజాల పట్టణంలోని 12వ వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ భర్త మహంకాళి నీలంరాజు వడ్డెర సామాజిక వర్గానికి చెందినవాడు కావడంతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడ్డాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీలంరాజు శివమాల వేసుకొని ఉన్నా అతన్ని గురజాల నుంచి మాచవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని బెదిరించి దారుణంగా కొట్టడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వడ్డెరలకు చెందిన నీలంరాజును మాత్రమే డబ్బులు కక్కిస్తామని బెదిరించడం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో 6వ వార్డు కౌన్సిలర్ వేముల కృష్ణ, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి బత్తుల రాంబాబు, మాజీ ఎంపీటీసీ గుంజా పూర్ణ, కుంచపు గంగరాజు, తమ్మిశెట్టి రామకృష్ణ, కొండేపూడి వంశీ, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు, వేముల నరసింహారావు, ఇర్లా శ్రీను, ఏడుకొండలు, గోగుల శ్రీను, వెంకటరావు తదితరులున్నారు.

హద్దు మీరిన అధికారులపై ఈసీకి ఫిర్యాదు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో హద్దుమీరి ప్రవర్తిస్తున్న ప్రతి అధికారిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం, మద్దిరాల, రాజాపేట, పోతవరం గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేనకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్తిపాటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీల్లో జగన్ వివాదాస్పద అధికారులను కావాల్సిన ప్రాంతాల్లోకి తెచ్చుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారుల నుంచి సీఐ, ఎస్ఐ వరకు వైసీపీ ప్రయోజనాలే లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్టు తెలుస్తుందని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో వీళ్ళల్లో ఏ ఒక్కరిని నమ్మే పరిస్థితి లేదని, సమస్యాత్మక ప్రాంతాల్లో వీరి పనితీరుపై తమకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే కోడ్ అమల్లోకి వచ్చిన అనంతరం జగన్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ప్రతి బదిలీని పునఃసమీక్షించాలని, వివాదాస్పద అధికారులను పూర్తిగా పక్కన పెట్టాలని తమ డిమాండ్ అన్నారు. ఈ విషయం పై పార్టీ తరుపున ఈసీని కలవనున్నట్టు ఆయన వెల్లడించారు. ప్రతి కార్యకర్త రోజుకు ఒక గంట పార్టీకి పనిచేస్తే పార్టీ గెలుపు సులభం అవుతుందన్నారు. రాబోయే ఎన్నికలకు టీడీపీ, జనసేన శ్రేణులు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ కార్యకర్త తోట రాజారమేష్, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల పార్టీ అధ్యక్షులు జువ్వాజి మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుకోట్ల మంది ఆకాంక్ష అమరావతి

● 1508వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 2: రాజధాని అమరావతిని నాశనం చేయాలనుకుంటే వైసీపీ ప్రభుత్వానికి తగిన శాస్తి జరుగుతుందని 33వేల ఎకరాల భూములిచ్చిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు చేపట్టిన ఆందోళనలు, నిరసనలు శుక్రవారం నాటికి 1508వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, ఎన్నికల ముందు జగన్‌రెడ్డి అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని నమ్మబలికి, అధికారంలోకి వచ్చిన తరువాత మూడు రాజధానులని నట్టేట ముంచే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. విశాఖ, కర్నూలు రాజధానులు పెడతానంటూ అభివృద్ధి లేకుండా చేశాడన్నారు. మాట తప్పను మడమ తిప్పను అన్న ఆయన అమరావతిని నిర్వీర్యం చేసి వెనకడుగు వేస్తున్నాడన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధిని కొసాగించమని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను ఇచ్చినా అమలు చేయాలన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

నేడు వడ్లపూడి బాబా మందిర వార్షికోత్సవం

● ఏర్పాట్లను పర్యవేక్షించిన పాతూరి నాగభూషణం



అన్న సంతర్పణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పాతూరి నాగభూషణం

మంగళగిరి, ఫిబ్రవరి 2: మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలోని భగవాన్ శ్రీసత్య షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం శనివారం జరుగనుంది. ఏటా ఫిబ్రవరి మూడవ తేదీన మందిర వార్షికోత్సవాన్ని ఓ భారీ తిరునాళ్ల మాదిరి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 2006లో అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న పాతూరి నాగభూషణం తన స్వగ్రామమైన పెదవడ్లపూడిలో ఈ మందిరాన్ని నిర్మించారు. పక్కనే శ్రీ విఘ్నేశ్వరస్వామివారి ఉపాలయాన్ని కూడా నిర్మించారు. అప్పటినుంచి ఏటా అటు ఆధ్యాత్మికతను, ఇటు సాంస్కృతిక వైభవాన్ని మేళవించి భారీ తిరునాళ్ల మాదిరి జరిపిస్తున్నారు. మందిరానికి ఎదురుగా ఓ ప్రత్యేక గోశాలను కూడ ఏర్పాటు చేయించారు. ఆంధ్ర షిరిడీగా దీనిని అభివృద్ధి చేస్తున్నారు. 18వ వార్షికోత్సవానికి అన్నీ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రానికే పూర్తి చేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్, జడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం రెండు రోజులుగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మందిరానికి ఎదురుగా వున్న ఖాళీస్థలంలో సాంస్కృతిక కళావేదిక ప్రాంగణం, దాని పక్కనే అన్న ప్రసాదశాలను ఏర్పాటుచేయించారు. ఖాళీస్థలంలో పిల్లలకోసం జయింట్‌వీల్ వంటి రంగులరాట్నాలతో కూడిన క్రీడా ప్రాంగణాన్ని అన్ని హంగులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేయిస్తున్నారు. మందిరంలో శనివారం తెల్లవారుజాము ఐదు గంటల నుంచే బాబావారి విగ్రహానికి వివిధ అభిషేకాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. భక్తులకు పెద్దఎత్తున అన్నవితరణ గావించేందుకు భారీఏర్పాట్లు చేశారు. సినీ, టీవి కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు.

రెండో రోజు.. అదే ఉత్సాహం

● కొనసాగిన విజ్ఞాన్ మహోత్సవ్ ● నేటితో ముగియనున్న ఉత్సవాలు



కబడ్డీలో నువ్వా... నేనా అంటూ..



బాస్కెట్‌బాల్‌లో పోటీలో...

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 2: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ నేటితో ముగియనున్నాయి. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ యువత తమ కలల్ని సాకారానికి అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు క్రీడా సంబరాల్లో మునిగిపోయారు. బాస్కెట్‌బాల్, ఖోఖో, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ ఇలా అనేక విభాగాల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. అంతర్లీనంగా దాగిన కళలు, సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెట్టారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు సోలో సాంగ్స్, లఘు నాటికలు, రెట్రో డాన్స్ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విజ్ఞాన్ మహోత్సవ్ నేటితో ముగియనుంది. ముగింపు కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఇండియన్ నేషనల్ క్రికెట్ టీమ్ మాజీ సెలక్టర్, క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్, నటుడు కిరణ్ అబ్బవరం, రచయిత బుర్రా సాయి మాధవ్‌లు రానున్నారని వీసీ వెల్లడించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుందరం మాస్టర్ యూనిట్ సందడి





యువత ఫ్యాన్‌షో.. నృత్యాలు, ఇన్‌సెట్లో మాట్లాడుతున్న వైవా హర్ష

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 2: విజ్ఞాన్స్ విద్యాసంస్థలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన తాను... సినీ హీరోగా మీ ముందుకు మీలో ఒకడిగా వస్తున్నాని వర్ధమాన సినీ నటుడు హర్ష చెముడు (వైవా హర్ష) అన్నారు.విజ్ఞాన్స్ యూనివర్సిటీలో విజ్ఞాన్స్ మహోత్సవ్‌లో రెండో రోజు సుందరం మాస్టర్ సినిమా యూనిట్ సందడి చేసింది. హీరో హర్ష మాట్లాడుతూ మీ మీద మీకు నమ్మకం ఉండాలని, మీకు ఏది అనిపిస్తే అదే చేయాలన్నారు. తన సినీ జీవితంలో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని విద్యార్థులకు తెలిపారు. డైరెక్టర్ కల్యాణ్ సంతోష్ మాట్లాడుతూ బ్యాక్ బెంచ్ విద్యార్థులకు, తోటి స్నేహితులకు సపోర్ట్‌గా నిల్చిస్తే... వారు ఏదో ఒకరోజు అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు.

80 కిలోల గంజాయి స్వాధీనం

● కాజ టోల్‌ప్లాజా వద్ద గంజాయి పట్టివేత
● గంజాయి రూ.20 లక్షల విలువ
● పోలీసుల అదుపులో నలుగురు నిందితులు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్ఈవో వెంకటేశ్వరరావు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 2: మంగళగిరి మండలం కాజ టోల్‌ప్లాజా వద్ద మంగళగిరి ఎస్ఈబీ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి పట్టుబడింది. మంగళగిరి ఎస్ఈబీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఈబీ డీఎస్ఈవో ఎం.వెంకటేశ్వరరావు వివరాలను వెల్లడించారు. ఎస్ఈబీ అధికారులు టోల్‌ప్లాజా వద్ద గురువారం మధ్యాహ్నం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో 76 కిలోల గంజాయిని గుర్తించినట్టు చెప్పారు. వెనుకగా వస్తున్న మరో కారులో 4 కిలోల గంజాయిని గుర్తించడం జరిగిందన్నారు. మొత్తం రూ.20 లక్షల 38 వేల విలువ చేసే 80 కిలోల గంజాయితోపాటు రెండు కార్లు, రూ.13,590 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తిరుపతి జిల్లా శట్టిపల్లె గ్రామానికి చెందిన మన్నెం బత్తయ్య, పొత్తూరు గ్రామానికి చెందిన పసుపులేటి గిరిబాబు, చంద్రగిరి మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన ఎట్టికుప్పం మునిబాలిరెడ్డి, బుచ్చినాయుడుపల్లి గ్రామానికి చెందిన పాకాల రాజశేఖర్ అనే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. మరో ఇరువురు నిందితులు విశాఖపట్నం పాకలపాడు పుత్తాడి గ్రామానికి చెందిన చిన్నా అలియాస్ మంగళపల్లి ప్రతాప్, తిరుపతి జిల్లా చేకూరుపల్లి గ్రామానికి చెందిన కోడిపుంజుల వాసులు పరారీలో వున్నట్టు తెలిపారు. నిందితులు కారు కిరాయిలకు తిప్పుతూ చెడు వ్యసనాలకు బానిసలై ఈజీ మనీకి అలవాటు పడి వక్రమార్గంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దుర్బుద్ధితో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్టు చెప్పారు. అనకాపల్లి జిల్లా పరిసర ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి తిరుపతి జిల్లాలో అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్.కృష్ణకిషోర్‌రెడ్డి, మంగళగిరి ఎస్ఈబీ సీఐ ప్రసన్నలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన భర్త

వినుకొండటౌన్, ఫిబ్రవరి 2: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను భర్త చంపిన ఘటన పట్టణంలోని మసీదుమాన్యంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ సీఐ సాంబశివరావు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లాపల్లి మండలం పలుకూరు గ్రామానికి చెందిన అంగలకుదురు పోతులూరయ్యచారి, నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామానికి చెందిన నాగేశ్వరి(30)లకు పదేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా వారిద్దరి మధ్య కలతలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో నాగేశ్వరిపై గురువారం భర్త గడ్డపారతో దాడి చేసి గాయపరిచాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. భర్త పోతులూరయ్యచారి పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. మృతురాలికి కుమార్తె కలదు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి మహిళ మృతి

మాచర్ల, ఫిబ్రవరి 2: ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని పశువేముల సమీపంలో గురువారం రాత్రి జరిగింది. మండలంలోని చింతలతండాకు చెందిన రమావత్ బుజ్జిబాయి(42) తన కుమారుడు బైకుపై మాచర్ల నుంచి స్వగ్రామానికి వస్తుండగా పశువేముల సమీపంలోకి రాగానే ఎదురుగా ఆటో రావడంతో బైకు అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో బుజ్జిబాయి తలకు తీవ్ర గాయాలు కావడంతో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ బుజ్జిబాయి మృతిచెందింది. మృతురాలికి ఇరువురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురి సౌత్ ఎస్ఐ వెంకట కొండారెడ్డి తెలిపారు.

భారీగా గోవా మద్యం స్వాధీనం

వినుకొండటౌన్, ఫిబ్రవరి 2: అక్రమంగా గోవా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని రూ.10లక్షల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని చీకటీగలపాలెం అడ్డరోడ్డులోని ప్రియాంక దాబా హోటల్ యజమాని వల్లెం శ్రీనివాసరావు గోవా నుంచి తెచ్చిన మద్యాన్ని నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు తెలిపారు. అతనిని అరెస్టు చేసి మద్యం సీసాలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎస్ఐ నగేష్, సిబ్బంది సురేష్ తదితరులు ఉన్నారు.



శ్రీనివాసరావును అరెస్ట్ చూపుతున్న జిల్లా సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్

త్వరలో మల్లాది టీడీపీలో చేరిక



మల్లాది శ్రీమన్నారాయణ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2: పట్టణానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, నటుడు మల్లాది శ్రీమన్నారాయణ త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరబోతున్నారు. ఇప్పటికే ఆయన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుతో టచ్‌లో ఉన్నారు. 2019 ఎన్నికల్లో మల్లాది వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన విడదల రజినీకి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా వ్యవహరించారు. అనంతరం హైదరాబాద్ వెళ్ళి పలు టీవీ సీరియళ్లలో నటిస్తూ వచ్చారు. ఆయన 1985-88 మధ్య గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1985-86లో ఏపీ ఐబీసీ డైరెక్టర్‌గా ఉన్నారు. 1987లో జిల్లా పరిషత్ అధ్యక్ష ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేసి దొడ్డపనేని ఇందిరపై ఓడిపోయారు. 1995 - 99లో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా వ్యవహరించారు. 1997, 2002లో ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా, స్టేట్ బోర్డు డైరెక్టర్‌గా వ్యవహరించారు. 2004లో రాయపాటి సాంబశివరావు ప్రోద్బలంతో చిలకలూరిపేట అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తిరిగి 2014లో మల్లాది టీడీపీ విజయానికై ఇక్కడ కృషి చేశారు. గత నాలుగున్నరేళ్ళుగా రాజకీయాలకు దూరంగా ఉన్న మల్లాది ఇప్పుడు టీడీపీ వైపు దృష్టి సారించారు.

రైతుల ప్రత్యామ్నాయ ప్లాట్లపై అపోహలు వద్దు

● ఏపీ సీఆర్‌డీఏ స్పెషల్ ల్యాండ్స్ కలెక్టర్

విజయవాడ, ఫిబ్రవరి 2: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) పరిధిలో భూసమీకరణ పథకంలో భూములను ఏపీ సీఆర్‌డీఏకి అప్పగించిన రైతులకు కేటాయించిన నివేశన, వాణిజ్యస్థలాలు భూసేకరణలో ఉన్నందున రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినట్లు ఏపీ సీఆర్‌డీఏ ల్యాండ్స్ స్పెషల్ కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని ప్లాట్లు భూసేకరణ పూర్తికాని భూమిలో ఉన్నట్లుగా గుర్తించి రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందాలని నోటీసులు జారీచేసినట్లు పేర్కొన్నారు. ఈ లాటరీ ప్లాట్ల కేటాయింపు అంశంలో మాస్టర్ ప్లాన్‌లో లాంటి మార్పులు జరగలేదన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్ల కేటాయింపులో వారి గ్రామాల్లోనే ప్లాట్లు కేటాయించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో పొరపాట్లను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఈ-లాటరీ జరుగుతుందన్నారు. ఈ-లాటరీకి హాజరయ్యే రైతులకు ఆయా గ్రామాలకు లేఅవుట్ ప్లాన్లు విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు సందేహాలుంటే నివృత్తి చేస్తామన్నారు. అయినా ప్రత్యేకంగా రైతుల సౌకర్యార్థం, వారి సందేహాలను నివృత్తి చేసేందుకు ఐనవోలు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరు-1,2, అనంతవరం, కురగల్లు-1,2, నెక్కల్లు, నిడమర్రు 1,2, వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం -1,2, కొండమరాజుపాలెం, నవులూరు-1,2, లింగాయపాలెం, వెంకటపాలెం, రాయపూడి-1,2 గ్రామాల రైతులకు ఫిబ్రవరి 3, 4న సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ-లాటరీలో పాల్గొనే రైతులు విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయానికి వచ్చి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

నవులూరు, లింగాయపాలెం ఈ-లాటరీ 8కి వాయిదా

ఏపీ సీఆర్‌డీఏ పరిధిలో భూసమీకరణ పథకంలో భూములను సీఆర్‌డీఏకు అప్పగించిన రైతులకు కేటాయించబడిన నివేశన, వాణిజ్య స్థలాలు భూసేకరణలో ఉన్నందున, అదింకా పూర్తికానందున రైతులకు కేటాయించేందుకు ఫిబ్రవరి 2న జరగాల్సిన నవులూరు, లింగాయపాలెం గ్రామాల మూడో విడత ఈ-లాటరీ ఫిబ్రవరి 8కి వాయిదా వేసినట్టు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండుసార్లు నోటీసులిచ్చినా రైతులు హాజరుకాకపోవడంతో వారికి మరో అవకాశం ఇచ్చి ఫిబ్రవరి 8న బుధవారం ఉదయం 11 గంటలకు నవులూరు 1,2, మధ్యాహ్నం 12గంటలకు లింగాయపాలెం గ్రామాలకు లాటరీ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య



ఏడుకొండలు మృతదేహం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 2: పట్టణ శివారు కాలనీ కామిరెడ్డి రోశిరెడ్డి నగర్ వద్ద నరసరావుపేట పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కుంచెపు ఏడుకొండలు(55) శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరసరావుపేట రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం చవిటిపాలెం గ్రామానికి చెందిన ఏడుకొండలు గత 20 ఏళ్ళుగా నరసరావుపేట పట్టణంలోని బరంపేట శిశుమందిర్ స్కూలు వద్ద నివాసముంటున్నాడు. గురువారం రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పట్టణంలో వెతికారు. శుక్రవారం ఉదయం వినుకొండ రోడ్డులోగల కామిరెడ్డి రోశిరెడ్డి నగర్ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉన్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు. ఏడుకొండలు ఆత్మహత్యకు ఆర్థిక సమస్యలా మరేమైనా ఇతర కారణాలు ఉన్నాయా అని పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

రియల్ ఎస్టేట్ మధ్యవర్తి దారుణ హత్య



హత్యకు గురైన రామకృష్ణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 2: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మధ్యవర్తిగా పనిచేసే వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో గురువారం అర్ధరాత్రి తరువాత జరిగింది. పట్టణంలోని రంగాకాలనీకి చెందిన చెన్నంశెట్టి రామకృష్ణ (45) రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేస్తున్నాడు. అతను తన ఇంటిని అమ్ముకొని పట్టణంలోని 14వ వార్డులో ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని పోలీసులు తెలిపారు. రామకృష్ణ ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో మృతి చెంది ఉండటాన్ని ఆ ప్రాంత ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి వివరాలు సేకరించారు. రామకృష్ణ గొంతు కోసి చంపి ఉండటాన్ని గుర్తించారు. మద్యం సేవించేందుకు రామకృష్ణను తీసుకు వచ్చి నమ్మకంగా చంపారని పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీమ్‌ను, డాగ్ స్క్వాడ్‌ను కూడా రప్పించి విచారణ చేపట్టారు. రామకృష్ణతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బంధువుల ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 1,21,141 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,21,190 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 70,863 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	14500	17000
334	9000	20500	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు.5	9500	18000	తేజ	8000	21500
273	12500	20100	బ్యాడిగి	10000	19000
341	8500	20000	దేవనూరుడీలక్స్	11000	18000
4884	10000	19500	తెల్లకాయలు	5000	12000

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

● డ్రైవర్ వేధింపులే కారణం?

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 2: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని గురువారం ఉరివేసుకుంది. ఇది గమనించిన కుటుంబసభ్యులు గుంటూరు జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ప్రజాశక్తినగర్‌లో నివాసముంటున్న చెరుకూరి క్రిస్టినా(15) 10వ తరగతి చదువుతోంది. తండ్రి సామ్యేలు హైదరాబాద్‌లో చర్చి పాస్టర్‌గా పనిచేస్తూ తాతయ్య, అమ్మమ్మల వద్ద వుంచి చదివిస్తున్నాడు. మాదినపాడు గ్రామానికి చెందిన కొత్తపల్లి సాగర్ వాహనాలకు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో క్రిస్టినాను ప్రేమిస్తున్నానంటూ కొంతకాలంగా సాగర్ వేధింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులను తట్టుకోలేక క్రిస్టినా ఉరివేసుకొని మృతిచెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని మహిళ మృతి

తెనాలి క్రైం, ఫిబ్రవరి 2: రైలు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన కొలనుకొండ రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం జరిగింది. తెనాలి రైల్వే పోలీసులు తెలిపిన సమాచారం మేరకు తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలో కొలనుకొండ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం 55-60సంవత్సరాల గుర్తు తెలియని మహిళ ఎదురుగా వస్తున్న రైలును గమనించకుండా పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొని మృతి చెందింది. మృతురాలికి సంబంధించిన సమాచారం లభించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.28 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	214.00
చికెన్ స్కిన్ లెస్	224.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

తక్కువ ఖర్చు.. అధిక లాభాలు

● మత్స్యసాగుకు ప్రభుత్వం చర్యలు ● కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి 2: తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వచ్చేలా మత్స్యసాగుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లాలో 19 యూనిట్ల స్థాపనకు ఆమోదం తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. అధునాతన సాంకేతిక విధానంతో ఆక్వాసాగు అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఒక్కో యూనిట్ రూ.50 లక్షలతో 15 యూనిట్ల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారన్నారు. తద్వారా మత్స్య సంపద విస్తృతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖాధికారి పి.సురేష్, ప్రకాశం జడ్పీ సీఈవో బి.జిలారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సి.హెచ్.కృష్ణ, ఎల్‌డీఎం శివకృష్ణ పాల్గొన్నారు.



జిల్లా స్థాయి కమిటీతో సమీక్షిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

నిత్యావసర సరుకుల పంపిణీ పరిశీలించిన జేసీ

బాపట్ల, ఫిబ్రవరి 2 : ఇంటివద్దకే నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ పరిశీలించారు. మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో సరుకుల పంపిణీని పర్యవేక్షించి వాహనాలను తనిఖీ చేశారు. నిత్యావసర వస్తువులు కార్డుదారులకు సక్రమంగా అందించే విధానం, పంపిణీ కార్యక్రమాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలఅధికారి ఐబి విలియమ్స్, ఆర్డీవో గంధం రవీందర్, తహసీల్దార్ ఎం.శ్రావణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న జేసీ శ్రీధర్, డీఎస్‌వో విలియమ్స్ తదితరులు

ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి సేవలు మరువలేనివి

● సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు

బాపట్లరూరల్,ఫిబ్రవరి 2 : సంగం డెయిరీ మాజీ చైర్మన్, దివంగత ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి చేసిన సేవలు ఎంతో గొప్పవని సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు అన్నారు. శుక్రవారం అప్పికట్ల పాలశీతలీకరణ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ పాలఉత్పత్తిదారుల సహకార సంఘం లిమిటెడ్ వేతన కార్యదర్శులు, వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి 30వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సంగం డెయిరీ పాలకవర్గ సభ్యులు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ డీవీసీ అభయలో అంతర భాగమైన డీవీసీ మరణ సహాయనిధి కింద లక్షా 50 వేలు, డీవీసీ రిటైర్మెంట్ స్కిల్ ద్వారా రూ.లక్ష, వయస్సు, సర్వీస్, సీనియార్టీ ప్రతిపాదికగా ఇచ్చేందుకు కృషి చేసిన సంగం మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పాడిపశువు బీమా కింద ముగ్గురికి బీమా చెక్కులను అందజేశారు. అదేవిధంగా ఒక్కరికి డెత్ రిలీఫ్ ఫండ్ కింద నగదు చెక్కును పాలకవర్గ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్‌లు దేవిరెడ్డి వెంకట సుబ్బయ్య, మరీదు వెంకటేశ్వరరావు, గొల్లపూడి శ్రీనివాసరావు, అప్పికట్ల మేనేజర్ నరేష్‌బాబు, సుధీర్‌బాబు, పూండ్ల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు అప్పసాని మహేంద్రనాథ్ చౌదరి, రావిపాటి రవి తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతులకు బీమా చెక్కులను అందజేస్తున్న సంగం డెయిరీ పాలకవర్గ సభ్యులు

స్వామి వివేకానంద జయంతి వేడుకలు

కర్లపాలెం, ఫిబ్రవరి 2 : కర్లపాలెంలోని శ్రీరామకృష్ణ సేవాసమితిలో శ్రీస్వామి వివేకానంద 162వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీవివేకాందనస్వామి వారికి మంగళహారతి, సుప్రభాతం, ప్రత్యేక పూజలు, నివేదన, హారతి కార్యక్రమాలను సమితి వ్యవస్థాపకుడు కాటూరి వెంకటేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మరాజు వెంకటసుబ్బారావు, చందు పిచ్చయ్య నిర్వహించారు. చిన్నారులు వివేకానందస్వామివారికి పుష్పాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూచిపూడి నృత్యం, కోలాట కార్యక్రమాలను జరిపారు. శ్రీరామకృష్ణ సేవాసమితి చీరాల అధ్యక్షులు వి.ఎస్.ఎన్.మూర్తి వివేకానందస్వామి గురించి వివరించారు. భక్తులకు అన్నదానం చేసి పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తిమ్మరాజు వెంకటసుబ్బారావు, ఆరె.వెంకటేశ్వర్లు, మామిడాల సాంబశివరావు, కాకర్లపూడి రమణరాజు, బుల్లియ్య, శ్రీనివాసరావు, ఆలపాటి రమణరావు, తుమ్మల శ్రీనివాసరావు, లలితబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కాటూరి వెంకటేశ్వరరావు, తిమ్మరాజు వెంకటసుబ్బారావు

కోన ప్రభాకరరావు కళావేదిక ప్రారంభం

బాపట్ల, ఫిబ్రవరి 2 : పట్టణంలోని ఎవివి ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన కోన ప్రభాకరరావు కళావేదికను శుక్రవారం ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించారు. ప్రభుత్వం విద్యార్థులకు అనేక సదుపాయాలు కల్పిస్తూ వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రెసిడెంట్ బి.హరినాధమురళీ, పులిపాక రఘురాం, కోశాధికారి సుబ్బరాయుడు. టి.సుబ్బారావుదీక్షితులు, సూరగాని మురళీధర్, శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీఆర్‌వి ప్రసాద్, పాఠశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



కోన ప్రభాకరరావు కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి తదితరులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కర్లపాలెం, ఫిబ్రవరి 2 కర్లపాలెం మండలంలోని నర్రావారిపాలెం గ్రామానికి చెందిన గొట్టిముక్కల రాజుకు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి రూ.4 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు, ఆట్ల నాగేశ్వరరెడ్డి, గోవతోటి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

ఏలూరిపై కక్షసాధింపు చర్యలు సరికాదు : వేగేశన

బాపట్ల, ఫిబ్రవరి 2: కక్ష సాధింపు చర్యలో భాగంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై అక్రమ కేసు పెట్టటం దారుణమని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఈవిషయమై శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీకి వ్యతిరేకంగా ఉండేవారిపై ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఏలూరు సాంబశివరావుకు సంబంధంలేని కంపెనీలో ఆధారాలు లేకుండా కేసు పెట్టారన్నారు. దొంగ ఓట్లను బయటపెట్టిన వ్యక్తిపై కావాలని ఈ విధంగా చేశారన్నారు. రాబోయే ఎన్నికలలో వైసీపీ ఓడిపోతుందనే ఉద్దేశ్యంతో ఏలూరిపై అక్రమ కేసు పెట్టారన్నారు. వైసీపీ పాలనలో ఈవిధంగా చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. రాబోయే రోజులలో వైసీపీ నాయకులకు ఇంతకు రెట్టింపు ఏమిటో తాము చూపిస్తామన్నారు. ఒక మంచినాయకుడిపై కావాలని బురదచల్లాలనే ఈవిధంగా చేస్తున్నారని న్యాయం ఎప్పటికైన గెలుస్తుందన్నారు.



నరేంద్రవర్మ సమక్షంలో టీడీపీలో చేరుతున్న ఎంవీ రాజుపాలెం గ్రామస్థులు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

కర్లపాలెం, ఫిబ్రవరి 2 : కర్లపాలెం పంచాయతీ ఎంవీ రాజుపాలేనికి చెందిన వైసీపీశ్రేణులు శుక్రవారం టీడీపీ నాయకులు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, పిట్ల వసంతరెడ్డి ఆధ్వర్యంలో వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నరేంద్రవర్మ వైసీపీ శ్రేణులను సాదరంగా ఆహ్వానించి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అట్ల బిక్షాలురెడ్డి, ఆట్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, చిన్న వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, నాగబాబురెడ్డి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి, వసంతరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం పలికిన టీడీపీ శ్రేణులు

ఎం.వీరాజుపాలెం గ్రామస్థులు నరేంద్రవర్మ రెండోవ రోజు పర్యటనకు ఘనస్వాగతం పలుకుతూ జయహో టీడీపీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. మహిళలు నరేంద్రవర్మకు ఘనస్వాగతం పలుకుతూ నియోజకవర్గంలో టీడీపీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని నరేంద్రవర్మకు జేజేలు పలుకుతూ విజయం మనదే అంటూ నినాదాలు చేశారు. మామాట-నాబాట కార్యక్రమాన్ని ఎం.వీరాజుపాలెంలో నరేంద్రవర్మ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి, వసంతరెడ్డి, టీడీపీ నాయకులు ఏపూరి భూపతిరావు, నక్కల వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ షేక్.బాజి, బైరాగి శ్రీనివాసరెడ్డి, తుమ్మరి కుంట దాసు, చంద్రశేఖర్‌రెడ్డి, బొద్దుకూరి విజయ, పఠాన్ అహ్మద్‌బాషా, దాసు, నబి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై అనీల్‌కుమార్



టి.అనీల్‌కుమార్

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 2 : చందోలు నూతన ఎస్సైగా టి.అనీల్‌కుమార్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎస్సై అనీల్‌కుమార్ చుండూరు పోలీసుస్టేషన్ నుండి బదిలీపై ఇచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ల రాజశేఖర్ వేమూరు పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్ళారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్సై అనీల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా పోలీసుస్టేషన్ సిబ్బంది, మహిళ పోలీసులు పరిచయం చేసుకున్నారు. ఎస్సై అనీల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

బాపట్లరూరల్ ఎస్‌హెచ్‌వో సీఐగా శ్రీహరి

బాపట్ల రూరల్, ఫిబ్రవరి 2 : బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో సీఐగా వైశ్రీహరి శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలు, యువకులు అల్లర్లు, గొడవలకు పాల్పడకూడదని, ఏదైనా సమస్య ఉంటే నేరుగా పోలీసులకు తెలియజేయాలన్నారు.

ఎస్ఐగా రవీంద్రరెడ్డి బాధ్యతలు స్వీకరణ



ఎస్ఐ రవీంద్రరెడ్డి

కొల్లూరు, ఫిబ్రవరి 2 : ఎస్ఐగా రవీంద్రరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

వేమూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్



ఎస్ఐ రాజశేఖర్

వేమూరు, ఫిబ్రవరి 2 : వేమూరు పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన నాగరాజు వీఆర్‌కు వెళ్ళగా చందోలు ఎస్సైగా పని చేస్తున్న రాజశేఖర్ వేమూరుకు బదిలీపై వచ్చారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని రానున్న ఎన్నికలు సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు శ్యామ్‌ప్రసాద్ మృతి

బాపట్ల ఫిబ్రవరి 2 : భారతీయ జనతాపార్టీ యువమోర్చా రాష్ట్ర కోశాధికారి బొడ్డు కృష్ణచైతన్య తండ్రి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బొడ్డు శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. నియోజకవర్గంలోని పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామానికి చెందిన శ్యామ్ ప్రసాద్ నిజాంపట్నం మండలంలోని గోకర్ణమఠంలోని ఎంపీయూపీ స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన మృతికి నాయకులు, ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు. అల్లూరులోని ఆయన స్వగ్రామంలో భౌతికకాయాన్ని యువమోర్చా రాష్ట్రాధ్యక్షులు మిట్ట వంశీ కృష్ణ పార్టీశ్రేణులతో కలిసి సందర్శించి పుష్పాంజలి ఘటించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి



ప్రదీప్ మృతదేహం

బాపట్ల, ఫిబ్రవరి 2 : పట్టణంలోని వివేకానందకాలనీలో పెయింటింగ్ పనిచేస్తున్న యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పట్టణ ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం పట్టణంలోని హయ్యర్ నగర్‌కు చెందిన దాసి ప్రదీప్ (23) పెయింటింగ్ పనికి వెళుతుంటాడు. శుక్రవారం వివేకానందకాలనీలో ఓ ఇంట్లో పెయింటింగ్ పనులు చేస్తుండగా ఎర్త్‌వైర్‌లో విద్యుత్ ప్రవహించటంతో అది తగిలి ప్రదీప్ అక్కడికక్కడే కుప్పకూలాడు. చుట్టు పక్కలవారు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్ళటంతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విభజనహామీలు సాధన కోసం ప్రజా ఉద్యమాలు అవసరం

బాపట్ల, ఫిబ్రవరి 2 : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధన కోసం ప్రజా ఉద్యమాలు అవసరం ఉందని నవ్యాంధ్ర చైతన్య వేదిక ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్రాధ్యక్షులు కోట వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. మండలంలోని వెదుళ్ళపల్లి ఘంటసాల చైతన్యభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రజలలో రాష్ట్ర సమగ్రాభివృద్ధికై ప్రజాస్వామిక చైతన్యం పెరగాలన్నారు. సమావేశంలో నాగిరెడ్డి, అక్షరదీప్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోట వెంకటేశ్వర్లురెడ్డి

మున్నంగివారిపాలెంలో లేగదూడల అందాల పోటీలు

చుండూరు ఫిబ్రవరి 2 : పాడిపంట సంతృప్తిగా ఉన్నపుడే రైతు కుటుంబాలు సంతోషంగా ఉండగలుగుతారని మండల అధ్యక్షుడు జాలాది రూబెన్ అన్నారు. పశువర్ధకశాఖ, రాష్ట్ర పశుగణాభివృద్ధి శాఖ సంయుక్తంగా మున్నంగివారిపాలెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన లేగదూడల అందాల పోటీలను, పశు విజ్ఞాన బడిలను ఆయన ప్రారంభించారు. రైతుల సంక్షేమానికి అన్ని విధాలుగా ప్రభుత్వాలు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. వేమూరు సహాయ సంచాలకులు కె.వి.జనార్ధనరావు మాట్లాడుతూ రైతు సోదరులు తమ పశువులకు తప్పనిసరిగా ప్రభుత్వం అందిస్తున్న బ్రూసెల్లా సిపిఆర్ గాలికుంటు వ్యాధి నిరోధక ఉచిత టీకాలను వేయించుకోవాలని కోరారు. తెనాలి డిప్యూటీ డైరెక్టర్ వై.కేదారేశ్వర్ ప్రసంగిస్తూ సబ్సిడీపై పశువుల బీమా సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. జిల్లా పశు సంవర్ధశాఖ అధికారి మద్దు హనుమంతరావు మాట్లాడుతూ సబ్సిడీ ధరలపై చాపకట్టర్స్ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న లేగదూడల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఈవో డాక్టర్ బాలశంకర్, సర్పంచ్ అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, ఉయ్యూరు మురళీజగన్మోహనరెడ్డి, డాక్టర్ చల్లా చలపతిరావు, డాక్టర్ వి.ఆశాజ్యోతి, డాక్టర్ మునియ్య, డాక్టర్ జి.అపర్ణ, తదితరులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి కొసనా రమేష్, ద్వితీయ బహుమతి మారిశెట్టి కోటయ్య, వెంకయ్య, ఖడ్గం వెంకయ్య, మెలికా గంగాధర్‌లు సాధించారు.



గెలుపొందిన రైతుకు బహుమతి అందిస్తున్న ఎంపిపి జాలాది రూబెన్

నేడు చుండూరులో జగనన్నకు చెబుదాం

చుండూరు ఫిబ్రవరి 2 : ప్రజా సమస్యల పరిష్కారం దిశగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం శనివారం చుండూరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కలెక్టర్ రంజిత్‌బాషా పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు మండల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకుని పరిష్కరించుకోవాలని అధికారులు కోరారు.

మట్టి ఖర్చులకు తక్షణ సహాయం

చుండూరు, ఫిబ్రవరి 2 : మండలంలోని ఆలపాడు గ్రామానికి చెందిన చేబ్రోలు అనీల్‌కుమార్ గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. అనీల్ మృతి చెందిన విషయం తెలుసుకున్న సర్పంచ్ గద్దే విజయలక్ష్మి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమర్తలూరు సాంబశివరావు, ఉమామహేశ్వరరావు, రమేష్, చేబ్రోలు బోడియ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

22న తాళ్ళమ్మతల్లి జాతర మహోత్సవాలు

నగరం, ఫిబ్రవరి 2 : మండలంలోని ధూళిపూడి పంచాయతీలోని శ్రీవీరమ్మ పేరంటాలు, తాళ్ళమ్మ తల్లి అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఈనెల 22, 23 తేదీల్లో జరుగుతాయని దేవదాయశాఖ ఈవో ఎస్.లక్ష్మీ ప్రసన్న తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 11న ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బయటకు తీసుకురావటం జరుగుతుందని తెలిపారు. అమ్మవారికి ధూళిపూడి గ్రామంలో సాయంత్రం పూజా కార్యక్రమం అనంతరం చుట్టు ప్రక్కల గ్రామాల్లో పూర్వపు సంప్రదాయం ప్రకారం తిప్పటం జరుగుతుందని తెలిపారు. 22న అమ్మవారికి నైవేద్యాలు, వీరమ్మ పేరంటాలు, చింతయ్యస్వామి కల్యాణ మహోత్సవం, 23న రాత్రి సిరిమానోత్సవం జరుగుతుందని తెలిపారు.

పిట్టలవానిపాలెం ఎంపీడీవోగా రమణమూర్తి



రమణమూర్తి

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 2 : పిట్టలవానిపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంవి.రమణమూర్తి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రకాశం జిల్లా కొండెటి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో భవనం మారుతిశేషమాంబ కృష్ణాజిల్లా ఘంటసాల మండలానికి బదిలీపై వెళ్ళారు.

కట్టారు.. పగలగొట్టారు

● ప్రజల సొమ్ము దుర్వినియోగం

బాపట్ల, ఫిబ్రవరి 2 : ప్రభుత్వం మారిన ప్రతిసారి అభివృద్ధి పనుల పేరిట ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. లక్షల రూపాయల ఖర్చుచేసి జీబీసీరోడ్డులో డివైడర్, సెంటర్‌లైటింగ్ ఏర్పాటు చేశారు. గతంలో గాదె వెంకటరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పెద్దఎత్తున నిర్మించారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పేరుతో మరోసారి డివైడర్‌లు మొత్తం తొలిగిస్తున్నారు. వీటితోపాటు డివైడర్‌పై గ్రిల్స్, సెంటర్ లైటింగ్ తొలిగించి నూతన నిర్మాణం చేసే పనులు చేపట్టారు. ఈవిధంగా ప్రజల సొమ్మును ఇష్టానుసారంగా వినియోగిస్తూ కట్టటం, పడగొట్టటం పరిపాటిగా మారింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. రోడ్డు నిర్మాణం చేపట్టే కాంట్రాక్టర్ పురపాలక సంఘానికి నష్టం తెచ్చే విధంగా పనులు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికే అనేక చోట్ల తాగునీటి పైపులైన్‌లు ధ్వంసం చేశారు. వీటిని మరమ్మతులు చేయటానికి పురపాలక సంఘానికి లక్షల రూపాయల భారం పడింది. మరలా డివైడర్‌తోపాటు వాటిపై ఉన్న విగ్రహాలకు కూడా తొలిగించి పురపాలక సంఘానికి అదనపు ఖర్చు తీసుకొచ్చారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.



జీబీసీ రోడ్డులో డివైడర్‌ను పగలగొట్టి గ్రిల్స్ తొలగిస్తున్న చిత్రం

రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలి

రేపల్లె, ఫిబ్రవరి 2 : రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే బేషరతుగా రద్దుచేయాలని గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాది నీలం రామ్మోహన్‌రావు అన్నారు. రేపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 30వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షకు గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, రేపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈదీక్షా శిబిరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణమూర్తి, రామనాధం, సత్యనారాయణ, రవికుమార్, ప్రదీప్, నారాయణ, పాల్గొన్నారు. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ యాక్ట్ 27/22చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, ఇటువంటి ప్రజావ్యతిరేక, చీకటి చట్టాల వల్ల న్యాయస్థానాల మనుగడే ప్రశ్నార్థకమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరూ తమ తమ ఆస్తులపై తమకు తెలియకుండానే హక్కులు కోల్పోతారని ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి మానుకుని ఈ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధమైన నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని, రైతు యాత్రలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గుంటూరు న్యాయవాదులు కట్టా కాళిదాసు, కొల్లి శంకరరావు, సీహెచ్ రవీంద్రబాబు, సాయిబాల వరప్రసాద్, రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షులు కేసన గోపాలరావు, ఆళ్ళ సూరిబాబు, పుప్పాల ఐజ్, శ్రీవాణి, కొలుసు రామారావు, మెండు సుబ్బారావు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో మాట్లాడుతున్న గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాది రామ్మోహన్‌రావు

కేంద్ర బడ్జెట్‌తో చేనేతకు తీవ్ర నష్టం

రేపల్లె, ఫిబ్రవరి 2 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేతకు పూర్తిగా అన్యాయం జరిగిందని టీడీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు విమర్శించారు. ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రూ.28.2 లక్షల మగ్గాలు ఉన్న దేశంలో రూ.200 కోట్లు మాత్రమే కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు కేటాయించటం దారుణమన్నారు. రూ.200 కోట్లు చేనేత అభివృద్ధిలో దారమనే నూలు, సబ్సిడీకి వర్క్ షెడ్ల నిర్మాణం కొరకు మాత్రమేనని, చేనేతకు ప్రత్యేక ప్యాకేజీ ఏదీ ప్రకటించలేదన్నారు. ఇప్పటికే జీఎస్టీల వల్ల చేనేత పరిశ్రమ ఇబ్బందులు పడుతున్నా విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోవటం విచారకరమన్నారు. 1985 చేనేత రిజిస్ట్రేషన్ చట్టం రక్షణ కొరకు ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కేవలం రూ.7 కోట్లు కేటాయించారు. సిబ్బంది జీతభత్యాల కొరకు రూ.115 కోట్లు చేనేతకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకుండా చేనేతను ఉద్దరిస్తారనటం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపుల వల్ల చేనేతకు ఒరిగిందేమీ లేదని, చేనేత రంగాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆయన విమర్శించారు.

రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యం : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్

రేపల్లె, ఫిబ్రవరి 2 : రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, వైజాగ్ స్టీల్, పోర్టులకు కోత, విభజన హామీల ఊసే లేదని, ధనవంతులను మరింత ధనికులను చేసి పేదలను పీల్చి పిప్పి చేసేలా కేంద్ర బడ్జెట్ ఉందని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024వ సంవత్సరానికి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ధనికులను మరింత ధనికులను చేసే విధంగా ఉందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ఆరోగ్య పరిస్థితి గురించి గొప్పలు చెప్పుకున్నప్పటికి దేశం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని మధ్యంతర బడ్జెట్‌లో అర్ధమవుతుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నిరాశే మిగిలిందని, రాష్ట్రంలో ప్రధాన రాజకీయ నేతలతో సహా అధికార వైసీపీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టటంలో విఫలమైందని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు కె.ఆశీర్వాదం, కెవీ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

బీసీల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న కేసన

భట్టిప్రోలు, ఫిబ్రవరి 2 : బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పని చేస్తున్నారని సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా మార్పు చేయడం పట్ల మాజీ అధ్యక్షుడు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై శుక్రవారం స్థానిక బౌద్ధస్థూపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పూర్వ అధ్యక్షుడు వాసుదేవ తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని సంఘాన్ని అడ్డుపెట్టుకుని తన స్వప్రయోజనాల కోసం ఆర్థిక ఎదుగుదలకు ఒంటెద్దు పోకడ పోలేదా అని అన్నారు. వాసుదేవ నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిస్థితులు ఎదుర్కొంటావని వెంకటేశ్వరరావు హెచ్చరించారు. న్యాయసలహాదారుడు అంగలకుదురు నటరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోకపోతే న్యాయపరంగా చర్యలకు దిగుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు రాయన ప్రసాద్, బీసీ నాయకులు యరగళ్ళ నాంచారయ్య, కూరపాటి రఘురామయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు

ఉత్తమ ఫలితాల సాధనతో ఉన్నత శిఖరాలు

● ఎస్వీఆర్ఎం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని

నగరం, ఫిబ్రవరి 2 : ఉత్తమ ఫలితాలను సాధించటం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎస్వీఆర్ఎం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. శుక్రవారం డిగ్రీ మూడు, ఐదు సెమిస్టర్ ఫలితాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమిస్టర్‌లో అత్యధికంగా విద్యార్థినీ, విద్యార్థులు ఉత్తీర్ణులైనారని, వారిని అభినందించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ పి.శ్రీనివాసరావు, కన్వీనర్ వల్లభనేని విష్ణువర్ధన్‌రావు, సభ్యులు బి.ప్రకాశ్‌బాబు, సురేష్, ఎ.నరసింహారావు పాల్గొన్నారు.



డిగ్రీ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్వీఆర్ఎం కళాశాల సెక్రటరీ బుచ్చయ్యచౌదరి, అధ్యాపకులు

ప్రమాదాల నివారణకు చర్యలు

మేదరమెట్ల , ఫిబ్రవరి 2: అద్దంకి రూరల్ సీఐగా శివరామ కృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై వాహనాలు నిలపడం వలనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. జాతీయ రహదారి అధికారులతో కలిసి రోడ్లపై వాహనాలు నిలుపకుండా చూస్తామన్నారు. గతంలో ఎ క్కువ ప్రమాదాలు జరిగిన పాయింట్లను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. అలాగే, కొరిశపాడు ఎస్ఐగా శివయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

శాంతి భద్రతలకు అధికప్రాధాన్యం

బల్లికురవ, ఫిబ్రవరి 2: బల్లికురవ ఎస్ఐగా పి.శివనాగిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ వేమన చీరాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొరిశపాడు స్టేషన్‌ను నుంచి శివనాగిరెడ్డి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ శివనాగిరెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా గ్రామాలలో ప్రత్యేక నిఘా పెడతామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళతామన్నారు. ప్రజలందరూ తమకు సహకరించాలని ఆయన కోరారు.

చినగంజాం ఎస్ఐగా శ్రీనివాసరావు

చినగంజాం, ఫిబ్రవరి 2: చినగంజాం ఎస్ఐగా ఎం.శ్రీనివాసరావు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మార్టూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన బదిలీపై చినగంజాం వచ్చారు. చినగంజాం పోలీసుస్టేసన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ కె.సురేష్ బదిలీపై కారంచేడు వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకి స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అద్దంకి అభివృద్ధికి రూ.30 కోట్లు ఒట్టిమాటేనా!

» వైసీపీ కౌన్సిలర్‌లు తీవ్ర అసంతృప్తి

అద్దంకి, జనవరి 2: అద్దంకి పట్టణంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా రూ.30 కోట్ల నిధులు మంజూరు కాబోతున్నాయని ఏడాది కాలంగా వైసీపీ నేతలు ఊదరగొడుతున్నారు. నాలుగైదు నెలల క్రితం అయితే ప్రతిపాదనలకు ఆమోదం పూర్తయింది, ఇక నిధులు మంజూరే తరువాయి, సార్వత్రిక ఎన్నికలలోపు పనులు పూర్తి చేసి ఓట్లు అడుగుతామని కూడా నమ్మబలికారు. తీరా చూస్తే అతిత్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ రాబోతున్నప్పటికీ నిధుల మంజూరు జాడ గురించి పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వస్తున్నాయి.

ప్రధానంగా అద్దంకి పట్టణంలో అంతర్భాగమై ఆక్రమణలకు గురైన అద్దంకి మేజర్ కాలువ కట్టలను రెండువైపులా అభివృద్ధిచేసి మినీ బైపాస్‌గా మార్చాలని పూర్తిస్థాయిలో కసరత్తు జరిగింది. ఆక్రమణలదారులను ఖాళీ చేయించేందుకు ఆయా శాఖల అధికారులు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో ప్రాథమికంగా ఆక్రమణలు లేనిచోట కాలువ కట్టల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇక పట్టణంలోని పలు శివారు కాలనీలలో సీసీ రోడ్లు ఎలాగూ వేయలేదు, కనీసం గ్రావెల్ రోడ్లు అయినా వేయాలని ఆయా వార్డుల కౌన్సిలర్‌లు కోరటంతో సుమారు రూ.30 లక్షలతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. ఇక నిధులు అదిగో వస్తున్నాయి.... ఇదిగో పనులు ప్రారంభిస్తున్నామని అధికార పార్టీ కౌన్సిలర్‌లు, నాయకులు ఒకింత హడావుడి చేశారు. ఎలాగూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రత్యేక నిధులు మంజూరు కానందున ఎన్నికల సమయానికి నిధుల వరద పారుతుందని, అభివృద్ధి పనులు చేపడతారని ప్రజలు కూడా భావించారు.



మినీ బైపాస్‌గా అభివృద్ధికి ప్రతిపాదించిన ఆక్రమణలకు గురై ఉన్న అద్దంకి మేజర్ కాలువ కట్టలు

అదేసమయంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న బాచిన కృష్ణచైతన్యను తప్పించి పాణెం హనిమిరెడ్డికి అప్పగించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన హనిమిరెడ్డి వైసీపీ కౌన్సిలర్‌లను తన చెంతకు చేర్చుకోవటంలో సఫలీకృతమైనప్పటికీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు విషయమై దృష్టి పెట్టలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారపార్టీ కౌన్సిలర్‌లు ఒకింత అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. మున్సిపల్ ఎన్నికల సమయంలో అభివృద్ధి పనులకు హామీ ఇచ్చి ఇప్పుడు కనీసం చిన్నపని కూడా చేపట్టకుండా ఏముఖం పెట్టుకొని వైసీపీకి ఓటు వేయమని అడగాలన్న మీమాంసలో పలువురు అధికార పార్టీ కౌన్సిలర్‌లు ఉన్నారు. ఎన్నికల ప్రచార సమయం లో ఓట్లు అడిగేందుకు వచ్చే అధికార పార్టీ నేతలను ప్రశ్నించాలన్న ఆలోచనలో ప్రజలు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను ముందే గ్రహించిన కొంత మంది అధికారపార్టీ కౌన్సిలర్‌లు ప్రచారానికి అంటీ ముట్టనట్లు ఉండటమో లేక టీడీపీలోకి జంప్ కావాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయలేదన్న సాకును చూపించి పార్టీ మారాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తుంది.



కాలువలో ముందుకు కదలని మురుగు

మొరాయించిన ఆర్టీసీ బస్సు

» ప్రయాణికుల అవస్థలు



మల్లాయపాలెం సమీపంలో మొరాయించిన ఆర్టీసీ బస్సు

బల్లికురవ, ఫిబ్రవరి 2: సురక్షితమైన ప్రయాణం అని నమ్ముకుని ఆర్టీసీ బస్సు ఎక్కిన ప్రయాణికులకు మార్గమధ్యంలో మొరాయించటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మండలంలోని మల్లాయపాలెం సమీపంలో శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో నర్సరావుపేట వైపు నుంచి అద్దంకి వస్తున్న ఆర్టీసీ బస్సు నడి రోడ్డుపై మొరాయిచింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు, ఉన్నత పాఠశాలకు, జూ నియర్ కళాశాలకు వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఆర్టీసీ బస్సులు కం డిషన్‌లో లేవని, అందుకే ఇలాంటి పరిస్థితి వచ్చిందని పలువురు ప్రయాణికులు ఆరోపించారు. అద్దంకి నుంచి నర్సరావుపేటకు వెళ్లే ఏకైక బస్సు మార్గమధ్యంలో నిలిచిపోవటంతో ప్రయాణి కులు తీవ్ర అవస్థలు పడ్డారు. బల్లికురవ మండల పరిధిలో సక్రమంగా ఆర్టీసీ బస్సులను నడవటం లేదని, కొన్నిరూట్లలో ఉన్న సర్వీ సులు కూడా రద్దు చేశారని ప్రయాణికులు ఆరోపించారు.

ఖోఖో విజేత అద్దంకి



గెలుపొందిన అద్దంకి క్రీడాకారులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 2: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ఖోఖో జిల్లాస్థాయి పోటీలు శుక్రవారం చీరాల ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూల్‌లో పోలీసులు పటిష్ట బందోబస్తు నడుమ జరిగాయి. ఈపోటీ గురువారం బాపట్లలో జరుగుతున్న సమయంలో నిర్వాహకులకు, క్రీడాకారులకు మధ్య చోటుచేసుకున్న వివాదం తారస్థాయికి చేరింది. దీంతో అధికారులు పోలీసుల సంరక్షణలో చీరాలలో ఈ పోటీని నిర్వహించారు. ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలో బాపట్ల నియోజకవర్గ టీం 6 పాయింట్‌లు సాధించగా, అద్దంకి నియోజకవర్గ టీం 15 పాయింట్‌లతో విజయ కేతనం ఎగురవేసింది. విజేతలు వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. విజేతలకు బాపట్లలో బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నత్తనడకన పార్కుల అభివృద్ధి పనులు



ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ వెనుక వైపు నిర్మాణంలో ఉన్న పార్కు పనులు

చీరాల, ఫిబ్రవరి 2: చీరాల నియోజకవర్గంలో పలుచోట్ల పార్కుల పనులు జరుగుతున్నాయి. ప్రారంభించిన తరువాత తగినంత వేగంగా పనులు జరగటంలేదు. దీంతో ఆహ్లాదం.. ఆటవిడుపు కోరుకునే వారు ఆ పార్కులు ఎప్పుడు పూర్తవుతాయా అని ఎదురుచూస్తున్నారు. మున్సిపల్ పరిధిలో ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ ప్రాంగణంలో స్కూలు వెనుకవైపు ఉన్న పార్కును అభివృద్ధి చేసేందుకు పనులు చేపట్టి కొన్ని నెలలవుతోంది. అయితే, నిర్మాణ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి. సెయింట్‌ఆన్స్ స్కూల్ సమీపంలో ఓ పార్కు నిర్మాణం జరుగుతోంది. ఆప్రాంతం గతంలో అపరిశుభ్రంగా ఉండేది. పార్కు పనులు ప్రారంభిచటం, పక్కనే సీసీ రోడ్డు నిర్మాణం జరగటంతో ఆ ప్రాంతం పరిశుభ్రంగా ఉంది. అంతవరకు బాగానే ఉంది. అయితే, పార్కు కోసం కేటాయించిన స్థలం చుట్టూ ఫెన్సింగ్ మాత్రమే వేసి, లోపల ఎర్రమట్టి తోలారు. అతరువాత పార్కుకు సంబంధించిన పనులు ప్రారంభించటంలో జాప్యం జరటం పట్ల ఆప్రాంత ప్రజలు ఒకింత అసంతృప్తి వ్యయం చేస్తున్నారు. ఆ పార్కు పూర్తయితే మూడు, నాలుగు వార్డుల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.



కొత్తపేట పరిధిలో కుందేరు ఒడ్డున నిర్మాణంలో ఉన్న పార్కు పనులు

ఇక కుందేరు పక్కన కొత్తపేట పంచాయితీ పరిధిలో నిర్మాణంలో ఉన్న పార్కు పనులను వేగవంతంచేసి ప్రారంబిస్తే ఆప్రాంత ప్రజలకు కూడా ఉప యోగకరంగా ఉంటుందని, పార్కు పనులను వేగవంతం చేయాలని కోరుతు న్నారు. కుందేరుకు మున్సిపల్ పరిధిలోని రామానాయుడు పార్కు మధ్యఉన్న ప్రాంతం అపారిశుద్ధ్యానికి అడ్డాగా ఉంది. దీంతో రామానాయుడు పార్కులో వాకింగ్, ఎక్సర్‌సైజులు చేసే వాకర్స్ అపరిశుభ్రంగా ఉండే ప్రదేశం నుంచి వచ్చే దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. కుందేరుకు, రామానాయుడు పార్కుకు మధ్యఉన్న ప్రదేశానికి కంచె ఏర్పాటుచేస్తే బాగుంటుందని వాకర్స్ కోరుతున్నారు. పాలకులు, అధికారులు వెంటనే స్పందించి పార్కుల నిర్మాణ పనులను వేగవంతంచేసి ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



సెయింట్‌ఆన్స్ స్కూల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న పార్కు

వ్యవసాయ మోటార్ల వైర్లు చోరీ

» ఆందోళన చెందుతున్న రైతులు

బల్లికురవ, ఫిబ్రవరి 2: గత కొంతకాలంగా పలు గ్రామాల్లో కొందరు గుర్తుతెలియని దొంగలు వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను పెద్ద ఎత్తున తస్కరిస్తున్నారు. తాజాగా బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామంలో గత నాలుగు రోజుల్లో సుమారు వంద వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను రాత్రి సమయంలో కట్ చేసుకువెళ్లారు. రైతులు పంటలకు నీటిని పెట్టేందుకు వెళ్లి మోటార్లు పనిచేయకపోవటంతో కేబుల్ వైర్ కట్ చేసి ఉండటం చూసి లబోదిబో మంటున్నారు. ఒక్కో మోటార్‌కు సుమారు రూ.రెండు వేల విలువ కలిగిన వైరు చోరీ జరుగుతుంది. కేబుల్ వైరు మోటార్ లోపలికి దొంగలు కట్ చేయటంతో బోరులో ఉన్న మోటార్లు బయటకు తీయటం చాలా కష్టంగా మారుతుందని రైతులు వాపోతున్నారు.



కొమ్మినేనివారిపాలెంలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీ చేయగా నిరుపయోగంగా ఉన్న బోర్లు

గతంలో కూడా పలుమార్లు ఇదే పద్ధతిలో చోరీలు జరిగాయి. రాత్రుళ్లు పొలాల్లో రైతులు లేని సమయం గమనించి ఇలాంటి చోరీలు జరుగుతున్నాయి. ఎవరో అనుభవం కలిగిన దొంగల పనే అయి ఉంటుందని రైతులు అంటున్నారు. మండలంలోని బల్లికురవ. నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, కొత్తపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, వైదన, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాల్లో కూడా గత ఆరు మసాల వ్యవధిలో వందల సంఖ్యలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీలు జరిగాయని రైతులు తెలిపారు. చోరీ విషయం పోలీసు స్టేషన్‌కు వెళితే వారు ఫిర్యాదులు కూడా తీసుకోవటం లేదని రైతులు తెలిపారు. తక్కువ నగదు చేసే కేబుల్ పోవటంతో కొందరు రైతులు ఫిర్యాదు చేసినా ఉపయోగం ఉండదులే అని కొత్త వైరు తీసుకువచ్చి అమర్చుతున్నారని కొందరు రైతులు తెలిపారు. గతంలో సోలార్ ప్లేట్లు, బోర్డులు కూడా తస్కరణకు గురయ్యాయని వారు తెలిపారు. ఒకేమారు వందల సంఖ్యలో పంట భూముల్లో ఉన్న మోటార్ల వైర్లు చోరీ జరగటంతో బోర్లు నిరుపయోగంగా ఉన్నాయని రైతులు తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న మోటార్ల కేబుల్ వైర్ల చోరీ ముఠా గుట్టురట్టు చేసేలా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

అక్రమ అరెస్టులతో టీడీపీని దెబ్బతీయలేరు!

» మచ్చలేని నాయకుడు ఎమ్మెల్యే ఏలూరి

» పార్టీ మండల అధ్యక్షుడు షంషుద్దీన్

పర్చూరు, ఫిబ్రవరి 2: అక్రమ కేసులు, అరెస్టులతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రతిష్టను దెబ్బతీయలేరని టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్ అన్నారు. మచ్చలేని, స్వచ్ఛమైన నాయకుడు ఎమ్మెల్యే ఏలూరని పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చి అభివృద్ధి, సంక్షేమం అనే ఆయుధంతో ప్రగతి పథంలో నిలిచిన ఘనత ఏలూరికే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఎక్కడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. అధికార పార్టీ పేరుతో అక్రమాలు, అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడుతుంది ఎవరో అందరికీ తెలుసునని చెప్పారు. బహిరంగా మైనింగ్, ఇసుక, రేషన్ అక్రమ వసూలు చేస్తుంది ఎవరో చిన్నపిల్లవాడిని అడిగినా చెప్పే పరిస్థితిలో ఉందన్నారు. దొంగే దొంగ అన్న చందంగా అధికార పార్టీ నేత కేకలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే ఏలూరిపై విమర్శలు చేసిన ప్రతిఒక్కరూ ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా విమర్శలు మానుకొని, ప్రజలకు సేవచేసి మన్ననలు పొందాలే కానీ ఇలా అక్రమ మార్గంలో తప్పుడు ఆరోపణలు చేయకూడదన్నారు. దాడికి వచ్చిన వ్యక్తులను వదిలి ఫిర్యాదు చేసిన ఫ్యాక్టరీల యాజమాన్యంపై కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు.

విలేకరుల సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కోడూరి శేషబ్రహ్మాచారి, దూళిపల్లి వెంకటస్వామి, కొరిటాల సురేష్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, చెరుకూరి చింపయ్య, షేక్ బషీర్, కన్నెగంటి సాంబయ్య, షేక్ హసేన్(ట్విన్స్) వెంకటేశ్వర్లు, శ్రీరాం వెంకటసుబ్బారావు, గిరి, తంగెళ్ళ మల్లికార్జునరావు, ఏసు, దాసి కిరణ్, ఇజ్రాయిల్, కట్టెంపూడి జీవన్, ఉప్పుటూరు జానీ తదితరులు పాల్గొన్నారు.



పర్చూరులో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు షంషుద్దీన్

కేసులకు భయపడేదిలేదు!

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 2: పర్చూ రు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక, అధికార పార్టీ ఆయనపై అక్రమంగా కేసులు పెడుతుందని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం యద్దనపూడిలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. పర్చూరులో రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఏలూరి సాంబశివరావు మూడోసారి పర్చూరులో గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. ఏలూరి గెలుపును అడ్డుకోవడం ఎవరితరమూ కాదన్నారు. పర్చూరు నియోజకవర్గం ప్రశాంతంగా ఉండటానికి కారణం ఏలూరి అని చెప్పారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజానీకం వాస్తవాలు గమనిస్తున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా అధికార పార్టీకి గుణపాఠం చెబుతారని అన్నారు. కేసులకు భయపడే నాయకులు ఏలూరి కాదని, ఆయన వెంట నడిచే సైనికులుగా మేమంతా ఉన్నామని నాయకులు స్పష్టం చేశారు.

విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు గుదే తారక రామారావు, నల్లపనేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, రావిపాటి సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చలో చినగంజాం

» పోలీసుల ముందస్తు అరెస్టులు

» ధ్వజమెత్తిన జనసేన నాయకులు

చినగంజాం, ఫిబ్రవరి 2: మండలంలోని చినగంజాం గ్రామ సర్వే నెంబర్లు 829, 830 భూముల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై చలో చినగంజాం కార్యక్రమంలో జనసేన, సీపీఎం నాయకులు పాల్గొనకుండా పోలీసులు శుక్రవారం వేకుమజామున ముందుస్తు అరెస్టులు చేశారు. చినగంజాం ప్రాంతంలో అధికార పార్టీ నాయకులు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలపై గురువారం జనసేన పార్టీ చలో చినగంజాం కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈనేపథ్యంలో శుక్రవారం వేకువజామున సీపీఎం నాయకుడు గున్నమనేని ప్రతాప్‌కుమార్, జనసేన మండల నాయకులు సందు శ్రీనివాసరావు, అడుసుమల్లి హరిబాబు, తోట అశోకచక్రవర్తి, తుమ్మలపెంట సతీష్, గంటా వెంకటేష్, బొప్పన శ్రీనివాసరావు, షేక్ కరిముల్లా, గంటా లక్ష్మీనారాయణ తదితరులను అదుపులోకి తీసుకొని చినగంజాం పోలీసుస్టేషన్‌కు తరలించారు. పర్చూరు, చీరాల నియోజకవర్గాలలోని జనసేన నాయకులను హౌస్ అరెస్టులు చేశారు. విచ్చలవిడిగా ఇసుక మాఫియా జరుగుతున్న కనీసం కన్నెత్తి చూడని అధికారులు అక్రమాలను ఎత్తి చూపాలనుకుంటున్న జనసేన నాయకులను అక్రమంగా నిర్బంధించడం హాస్యాస్పదంగా ఉందని జనసేన పార్టీ నాయకులు అన్నారు. ఇసుక అక్రమ రవాణాని వెంటనే ఆపాలని, చట్టప్రకారం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా చలో చినగంజాం కార్యక్రమం ద్వారా నిరసన తెలపడానికి పూనుకున్న ప్రతిపక్షాలపై పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని నిర్బంధించడం సరైన పద్ధతి కాదని అన్నారు. మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్ని నిర్బంధాలు విధించినా పోరాటం ఆపే ప్రసక్తి లేదని తెలిపారు.



చినగంజాంలో అనుమతులు లేకుండా తవ్వుతున్న ఇసుక క్వారీ

ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతన్న క్వారీల వద్దకు ఎవరు వెళ్లకుండా కడవకుదురు బస్టాండ్, కడవకుదురు జడ్పీ పాఠశాల సమీపంలో, ఇసుక క్వారీకి వెళ్లే దారిలో, క్వారీ వద్ద భారీసంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. శుక్రవారం వేకువజామున 5గంటలకు అదుపులోనికి తీసుకున్న జనసేన, సీపీఎం నాయకులను శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విడుదల చేశారు. చీరాల డీఎస్పీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఇంకొల్లు, చీరాల టూ టౌన్, చీరాల రూరల్ సీఐలు బి.శ్రీనివాసరావు, సోమశేఖర్‌రావు, నిమ్మగడ్డ సత్యనారాయణ, చీరాల డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, ఏఆర్, సర్కిల్ పరిధిలోని హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించారు.



పోలీసు స్టేషన్‌లో ఉన్న జనసేన, సీపీఎం నాయకులు



వ్యవసాయ బోరును పరిశీలిస్తున్న జిల్లా భూగర్భజలశాఖాధికారి సాంబశివరావు, తదితరులు

పంటలకు నీటి అవసరాన్ని మీటర్లు పెట్టి లెక్కిస్తాం!

మేదరమెట్ల , ఫిబ్రవరి 2: జిల్లాలో రైతులు సాగుచేసే పంటలకు సంబంధించి ఒ క్కో పంటకు ఎంత నీరు అవసరమవుతుందో మీటర్లు పెట్టి లెక్కిస్తామని జిల్లా భూగర్భ జల శాఖ అడిషనల్ డైరెక్టర్ సాంబశివరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని దైవాలరావులో వ్యవసాయ బోర్లను, బోర్ల కింద వేసిన పంటలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షపాతాన్ని లెక్కించి భూమిలోకి ఎంత నీరు వెళ్తుంది అనే అంచనాలను తయారు చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా లెక్కిస్తామని, వివిధ రకాల భూములలో వేసే పంటలను బట్టి ఏ పంటకు ఎంత నీరు వినియోగం అవుతుందనే విషయాన్ని మీటర్లు పెట్టడం ద్వారా అంచనా వేస్తామన్నారు. దీని ద్వారా ఆయా ప్రాంతాలల్లో భూ గర్భ జల మట్టలను గుర్తించడానికి వీలవుతుందని చెప్పారు. కొత్తగా భూగర్భ జలాలను తోడడానికి బోర్లు వేయడానికి నిర్ధారిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ శివవరప్రసాద్, వసంతకుమారి పాల్గొన్నారు.

రేపు దేవపాలనకు సాహిత్య పురస్కారం



దేవపాలన

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 2: కవి, జానపదకళాపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలనకు ఈనెల 4న పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కారం-2024ను అందజేయనున్నారు. ఇందుకు సంబంధించిన సభ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక మారం వారి సేవాసదన్ లో జరుగుతుందని పురస్కార ప్రధాత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, సాహితి మిత్రమండలి అధ్యక్షుడు లక్కరాజు చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

చీరాల,ఫిబ్రవరి 2: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటమే లక్ష్యంగా కలసికట్టుగా ముందుకు సాగుదామని ఆపార్టీ నాయకుడు నీలం శామ్యూల్ మోజెస్ పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గడియార స్తంభం సెంటర్లోని వైఎస్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

ఇంకొల్లు, ఫిబ్రవరి 2: ఇంకొల్లు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 4న స్థానిక ఎన్ఆర్అండ్‌వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్ వారిచే ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కరి కమలేశ్వరరావు, జెట్టి స్వామి తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని వారు పేర్కొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, ఫిబ్రవరి 2: ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను ప్రతిఒక్కరూసద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో యూబీ వరప్రసాద్ అన్నారు. మండలంలోని పెదగంజాం-1 సచివాలయం ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పి.సాయిశ్రీచరణ్, డాక్టర్ సమీన, డాక్టర్ సుధాకర్ 423 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 13 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎన్‌వీ గోపాలకృష్ణమూర్తి, గ్రామ కార్యదర్శి ఎం.భారతి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

చినగంజాం, ఫిబ్రవరి 2: చినగంజాం మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన పాలపర్తి పార్వతి ఎన్నికల నేపథ్యంలో గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, భూ రీసర్వే డీటీ దాసరి శ్రీకాంత్, సర్వేయర్ బి.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మార్టూరు, ఫిబ్రవరి 2: మార్టూరులోని విజయనగర్ కాలనీ సమీపంలో పొలాల్లో చెట్టుకు తన్నీరు సురేష్ (42) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రాజుపాలెం గ్రామ పంచాయతీలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న మృతుడు సురేష్ మార్టూరులో ట్రాక్టర్ డ్రైవరుగా పనిచేస్తుంటారు. అతనికి భార్య లక్ష్మీకోటేశ్వరమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె నర్సరావుపేటలో నర్సింగ్ కోర్సు చదువుతున్నారు. ఆమె వివాహ విషయమై తీవ్ర మనస్తాపానికి గురైన తండ్రి సురేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు చెబుతున్నారు. సురేష్ ఆత్మహత్య చేసుకున్న విషయం సాయంత్రం సమీపంలో పొలాల్లో పనిచేస్తున్న కూలీలు గమనించి మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ సైదా తెలిపారు.

ప్రతిభచాటిన సూరవరపుపల్లె విద్యార్థులు

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 2: గుంటూరులోని మాజేటి గురవయ్య హైస్కూల్ ఆడిటోరియంలో ఆదివారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన చేతిరాత నైపుణ్య పరీక్షలలో మండలంలోని ముగ్గురు విద్యార్థులకు బహుమతులు లభించాయని ఎంఈవో చిలుకూరి గోపి శుక్రవారం తెలిపారు. యద్దనపూడి మండలం సూరవరపుపల్లె గ్రామంలో ఎంపీపీఎస్(ఎస్‌సి) పాఠశాలకు చెందిన బొల్లాపల్లి చరణ్‌తేజ్ సూపర్ సబ్ జూనియర్స్‌లో మొదటి బహుమతిని గెలుచుకున్నారు. సబ్ జూనియర్స్‌లో ద్వితీయ బహుమతిని వంజా కీర్తి, నాల్గవ బహుమతిని నేలపాటి జెస్సీ గెలుచుకున్నారు. వీరిని శుక్రవారం పాఠశాలలో ఎంఈవో చిలుకూరి గోపితో పాటు పలువురు గ్రామస్థులు అభినందించారు. ఈసందర్భంగా స్కూలు ప్రధానోపాధ్యాయురాలు శారదను ఎంఈవోతో పాటు గ్రామస్థులు అభినందించారు.

పారిశుధ్యంపై మెరుగైన చర్యలు తీసుకోవాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 2: గ్రామాల్లో తడి, పొడి ప్రమాదకర వ్యర్థాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో పారిశుధ్యంపై మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యంపై మెరుగైన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు క్లాప్ మిత్రలు తగినవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ హనుమంతరావు, సెర్ప్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు, సంస్థ ట్రైనర్ బొల్లయ్య, ప్రదీప్, ఏసోబు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో సబ్‌స్టేషన్ ప్రారంభం

మార్టూరు, ఫిబ్రవరి 2: గృహ వినియోగదారులు, పరిశ్రమల యజమానులు సక్రమంగా విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఈఈ ఎస్.మస్తానరావు అన్నారు. మా ర్టూరులో రూ.2.5 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ పాల్గొనగా, విద్యుత్ అధికారులు ఎం.సురేంద్రబాబు, అంజిరెడ్డి, రమేష్, ఎంపీపీ భుక్యా శాంతి బాయి, సర్పంచ్ భుక్యా సుమితాబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవాలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 2: శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవాలు శుక్రవారం స్థానిక సాంస్కృతిక సమితి, చైతన్యభారతి ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. చెన్నైకు చెందిన కృతియస్ భట్ గాత్రకచేరి ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాన్ని అధ్యక్షుడు సూర్యదేవర ఉమామోహన్, కార్యదర్శి భాగినాశా మణిశాస్త్రి పర్యవేక్షించారు.